
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

మంగళవారం 17 డిసెంబరు 2024



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

తొలి స్నాతకోత్సవానికి ఎయిమ్స్ ముస్తాబు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న రాష్ట్రపతి
- నలుగురికి బంగారు పతకాలు
- పాల్గొంటున్న గవర్నర్, సీఎం



మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి భవన సముదాయం

మంగళగిరి ఎయిమ్స్ చిహ్నం

మంగళగిరి ఎయిమ్స్ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి బ్యాచ్ పూర్తి చేసుకుని పట్టాలను పొందుతున్న 47 మందిలో 17 మంది మహిళలు కాగా, మిగిలిన 30 మంది పురుషులే! మొత్తం 47 మందిలో నలుగురికి మాత్రం ఎయిమ్స్ యాజమాన్యం బంగారు పతకాలను ప్రకటించింది. ఈ నలుగురిలో ముగ్గురు మహిళలు కాగా ఒక్కరు మాత్రమే పురుషుడు. లియా ఆజీ, సుప్రభా సిన్హా, వీకే ఆదీరా, దాసరి దివ్యాన్షు అనే నలుగురికి బంగారు పతకాలను ప్రకటించారు.

నలుగురికి బంగారు పతకాలు

మంగళగిరి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొదటి బ్యాచ్ మెడికోలు తమ గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా తొలి స్నాతకోత్సవాన్ని పాలకవర్గం మంగళవారం మధ్యాహ్నం వేడుకగా జరిపేందుకు సన్నద్ధమైంది. ఈ వేడుకకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఆయుష్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ స్నాతకోత్సవం మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఎయిమ్స్ ఆవరణలోని ఆడిటోరియంలో ప్రారంభమై గంటన్నరపాటు కొనసాగుతుంది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము స్నాతకోత్సవ ప్రసంగంచేసి ప్రతిభ చూపిన నలుగురు వైద్య విద్యార్థులకు బంగారుపతకాలను అందజేస్తారు. అలాగే, ఎంబీబీఎస్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న 47 మందితోపాటు పోస్టు డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసుకున్న మరో నలుగురు విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తారు.

విభజన వరాల్లో ఒకటి

రాష్ట్ర విభజన వరాలలో ఒకటిగా మంగళగిరిలో ఎయిమ్స్ ఆసుపత్రి ఏర్పాటయింది. గతంలో ఒక్క దేశ రాజధాని ఢిల్లీకి మాత్రమే పరిమితమై ఉన్న అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ సేవలను దేశ ప్రజలందరికీ అందించాలన్న బీజేపీ ప్రభుత్వ సంకల్ప కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా పలు ఎయిమ్స్ ఆసుపత్రుల స్థాపన దశలవారీగా ఆరంభమైంది. ఇందులో.. ఫేజ్-4లో భాగంగా ఏపీకి రూ. 1618 కోట్ల వ్యయంతో ఎయిమ్స్ ఆస్పత్రిని మంగళగిరిలో ఏర్పాటు చేసేవిధంగా

(మిగతా 8వ పేజీలో)




స్నాతకోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



- పెరుగుతున్న శ్వాసకోశ సమస్యలు!
- జలుబు, దగ్గు లక్షణాలతో పిల్లలు విలవిల
- ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కారణమంటున్న వైద్యులు
- ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు పెరుగుతున్న చిన్నారులు

చిన్నారులపై.. చలి పంజా

వాతావరణంలో కొద్దికాలంగా చలి పెరిగింది. ఉదయం పొగ మంచు కురుస్తోంది. మారిన వాతావరణ పరిస్థితులు చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చలి వాతావరణంలో ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ప్రబలుతుండటంతో చిన్నారులు జలుబు, దగ్గు, ఆయాసం, జ్వరం, శ్వాసకోశ సమస్యలతో సతమతమవుతున్నారు. ఆయా సమస్యలతో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శిశు వైద్య విభాగంతో పాటు గుంటూరులోని పలు ప్రైవేటు చిన్న పిల్లల ఆస్పత్రులకు వస్తున్న బాధిత పిల్లల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఏడాదిలోపు చిన్నారుల్లో బ్రాంకైటిస్, ఆయాసం, దగ్గు, డొక్కలు ఎగరేస్తూ ఇబ్బందిపడుతున్నారు. గతంలో రోజుకు 150 మంది వరకు ఓపీ విభాగానికి వస్తుంటే, వ్యాధుల ప్రభావంతో ప్రస్తుతం ఓపీ సంఖ్య 200కు చేరినట్లు పీడియాట్రిక్ వైద్యులు చెబుతున్నారు.



గుంటూరు మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చలి పెరగడంతో ఇన్‌ఫ్లుయెంజా ఏ, అడెనో వైరస్, వంటివి విజృంభిస్తున్నాయి. పది రోజులుగా వీటి ప్రభావంతో దగ్గు, జలుబు, ఆయాసంతో పాటు ఊపిరితిత్తుల్లో గాలి గొట్టాల వాపుతో చిన్నారులు విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్న ఓపీలో 80 శాతం మంది చిన్నారుల్లో ఈ ఇబ్బందులే కనిపిస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. గుంటూరు నగరంలో సుమారు 40 వరకు చిన్న పిల్లల ఆస్పత్రులు ఉన్నాయి. ఒక్కొక్క చోట ప్రతి రోజూ 60 నుంచి 100 వరకు ఓపీలు నమోదవుతున్నాయి. ఇదే అదనుగా కొన్ని ఆస్పత్రుల్లో ఓపీలు పెంచడంతో పాటు కార్డు పని చేసే కాల వ్యవధిని 15 రోజుల నుంచి పదికి, పది రోజుల నుంచి వారానికి కుదించేస్తున్నారు. పరీక్షలకు సంబంధించి ప్రైవేటు ల్యాబుల్లో రూ.వేలు ఖర్చవుతున్నాయి.

మధ్యస్థ తరహా వ్యాధి లక్షణాలు..

ఇన్‌ఫ్లుయెంజాను ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల్లో సమస్యలు సృష్టించే వైరస్‌గా చెప్పవచ్చు. దీన్నే సీజనల్ ఫ్లూగా పిలుస్తారు. ఇందులో

(మిగతా 6వ పేజీలో)

ఎస్‌ఏ -1 గణితం పరీక్ష రద్దు



పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాల బాక్సులు

- ప్రశ్న పత్రాలు.. యూట్యూబ్‌లో ప్రత్యక్షం
- ప్రశ్న పత్రాలన్నీ పోలీసుస్టేషన్‌కు తరలింపు

గుంటూరు విద్య, డిసెంబరు 16 ఆంధ్రజ్యోతి: ఉమ్మడి జిల్లాలో సోమవారం జరగాల్సిన ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రాలు ముందుగానే యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో సోమవారం జరగాల్సిన పరీక్షల్ని విద్యాశాఖ రద్దుచేసింది. రాష్ట్రంలో ఏ జిల్లా నుంచి ప్రశ్నపత్రం లీక్‌అయిందనే విషయం విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులకు ఈనెల నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పరీక్షలకు 6వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులు హాజరవుతున్నారు. తాజాగా సోమవారం జరగాల్సిన పది గణితం ప్రశ్నపత్రం ఆదివారం రాత్రి నుంచే యూట్యూబ్‌లో ప్రత్యక్షమైంది. దీంతో అప్రమత్తమైన రాష్ట్రస్థాయి అధికారులు గణితం పరీక్ష రద్దుచేస్తున్నట్లు ఉదయం డీఈవోలకు సమాచారం పంపారు. వెంటనే డీఈవోలు సమాచారాన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు పంపడంతో సోమవారం పరీక్ష రద్దు అయింది.

ప్రశ్నపత్రాల బాక్సులు పోలీస్ స్టేషన్లకు....

ఎస్‌ఏ-1 పరీక్షలకు సంబంధించి ఇంకా మూడు సబ్జెక్టుల పరీక్షలు జరగాల్సి ఉంది. ప్రశ్నపత్రాల లీకేజీపై ఎంఈవోల స్థాయిలో సోమవారం సాయంత్రం హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రశ్న పత్రాలను సమీపంలోని పోలీసు స్టేషన్లకు తరలించాలని విద్యాశాఖ అధికారులు హెచ్‌ఎంలకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఒక్కో పాఠశాలకు వచ్చిన ప్రశ్నపత్రాల బాక్సులు మూడు, నాలుగు ఉన్నాయి. ఆయా బాక్సుల్ని స్టేషన్‌కు తరలించడానికి హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది. ప్రతిరోజు ఉదయం వాటిని స్టేషన్ నుంచి తీసుకురావడం మరలా పరీక్షలు నిర్వహించడం ఓ ప్రహసనంగా మారిందని, ఇందుకు అయ్యేరవాణా ఖర్చులు తాము భరించాల్సి వస్తోందని వారు వాపోయారు.

ప్రతిసారి ఎలా లీక్‌అవుతున్నాయో?

పాఠశాలల్లో జరిగే పరీక్షలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రశ్న పత్రాలు సిద్ధం చేసి వాటిని జిల్లాకామన్ ఎగ్జామినేషన్ బోర్డుకు పంపుతారు. అక్కడి నుంచి ఎంఈవో కార్యాలయాలకు, తరువాత స్కూల్ కాంప్లెక్సులకు ఇవి సరఫరా చేస్తారు. అయితే గత ప్రభుత్వం ప్రశ్నపత్రాల సరఫరాపై తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కొన్నిసార్లు పరీక్షకు ఒక రోజు ముందు వాట్సప్‌లో పెట్టడం వాటిని డౌన్‌లోడు చేసుకుని ఉపాధ్యాయులు బోర్డుపై రాయడం లేదా జిరాక్స్ తీసి పంపిణీ చేయడం చేశారు. ఫలితంగా అనేక సార్లు ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయి. అయినా పట్టించుకోకుండానే పరీక్షలు నిర్వహించారు. ఇటువంటి అవ లక్షణాల్ని కొత్త ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఫలితంగా పరీక్షల్ని రద్దుచేసి ప్రశ్నపత్రాలను పోలీసుస్టేషన్లకు తరలించినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే ఇందులో ఉండే వ్యయ ప్రయాసలు కూడా ప్రభుత్వం అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే రోశయ్య నా ఇల్లు కబ్జా చేయించాడు

- ఎస్పీ కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారు వెంకట రోశయ్య తన ఇంటిని కబ్జా చేయించారంటూ గుంటూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పొన్నూరు మొల్లావారివీధికి చెందిన షేక్ వాహీదుల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు పట్టణానికి చెందిన కేశినేని పద్మావతి అనే మహిళకు చెందిన ఇంటిని తాను 2022 జూన్ 22న 19 లక్షల 22 వేలకు కొనుగోలు చేసి విజయవాడలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపాడు. అప్పటినుంచి ఆ ఇంటిలో తమ కుటుంబం నివాసం ఉంటుందన్నారు. మూడునెలల తర్వాత అప్పటి పొన్నూరు ఎమ్మెల్యే కిలారు వెంకట రోశయ్య తన ఆస్తిని కాజేయాలనే దురుద్దేశంతో తెలంగాణలోని మేడ్చల్ ప్రాంతానికి చెందిన అశోక్ పాటిల్ అలియాస్ అశోక్ కుమార్ అనే వ్యక్తిని తీసుకువచ్చి, ఆయనను పద్మావతి అల్లుడు కేశినేని అశోక్‌కుమార్‌గా చిత్రీకరించి ఆయనతో తన ఇంటిని షేక్ అస్మత్ అనే వారి పేరుకి పొన్నూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2022 సెప్టెంబరు 16న రిజిస్ట్రేషన్ చేయించాడన్నారు. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న రోశయ్య తన పలుకుబడి ఉపయోగించి అప్పటి పొన్నూరు తహసీల్దార్ అయిన శెట్టిభక్తుని శ్రీకాంత్ కేదార్నాథ్ నుంచి తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇప్పించారన్నారు. పద్మావతి కుమార్తె కేశినేని రాణి యామినికి వివాహం కాకపోయినప్పటికీ ఆమె భర్త కేశినేని అశోక్ పాటిల్ అలియాస్ అశోక్‌కుమార్ అని తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకున్నారన్నారు. అంతేకాకుండా అప్పటి పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ఎస్.రాధారాణి తన ఇంటికి సంబంధించిన మున్సిపల్ టాక్స్‌ను వారి పేరుతో ఇచ్చారన్నారు. అప్పటి పొన్నూరు సబ్ రిజిస్ట్రార్ గోవర్ధనం రఘునాథ్ చక్రవర్తి ఎమ్మెల్యే ఆదేశాలతో నా ఇంటికి కేశినేని అశోక్ యజమానిగా పేర్కొంటూ ఆయన తన ఇంటిని షేక్ బాబావలి సతీమణి అస్మత్‌కు విక్రయించినట్లుగా తప్పుడు రిజిస్ట్రేషన్ చేశాడన్నారు. తాము ఇంటిలో లేని సమయంలో దౌర్జన్యంగా ఇంటిలోకి ప్రవేశించారన్నారు. అంతేగాక తమపై తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. దీనిపై తాను కోర్టును ఆశ్రయించగా విచారించిన కోర్టు కేసు క్వాష్ చేసిందన్నారు.ఇందుకు సంబంధించిన ఆధారాలను ఆయన ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదుతో జత చేసినట్లు తెలిపారు.

అక్రమ రుణాలపై దర్యాప్తు వేగవంతం

- రంగంలోకి దిగిన సీఐడీ అధికారులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇంచుమించు రూ.130 కోట్లు స్వాహా
- నేడు అనంతవరం, పచ్చల తాడిపర్రు, పొన్నూరు బ్రాంచ్‌లలో దర్యాప్తు

గుంటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన లక్ష్యంగా మహిళల స్వావలంబన కోసం ఏర్పాటు చేసిన సంస్థ మెప్మా. అయితే అందులో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు అక్రమాలకు బరితెగించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పొన్నూరు, పచ్చలతాడిపర్రు, అనంతవరం, గుంటూరు నగరంలోని కొరిటెపాడు, సంగడిగుంట, పాత గుంటూరు, కేవీపీ కాలనీతో పాటు అనేక మురికివాడలలో బోగస్ డ్వాక్రా గ్రూపులను పెద్దఎత్తున ఏర్పాటు చేసి, వారందరికీ గుంటూరులోని అనేక బ్యాంకుల్లో వారి గ్రూపుల పేరు మీద బ్యాంకు ఖాతాలను ప్రారంభించారు. వారి పేరు మీద పొదుపు చేస్తున్నట్లుగా మెప్మాలో పనిచేస్తున్న సీఓలు, బ్యాంక్ అధికారులతో కుమ్మక్కయి పెద్దఎత్తున నాటకాలు ఆడారు. అంతా సిండికేట్‌గా మారి ఆ గ్రూపుల పేరిట ఉమ్మడి గుంటూరు జిల్లాలో 130 కోట్ల రూపాయల రుణాలు పొందారు. వాస్తవానికి గ్రూపులో సభ్యులు మాత్రం ఉంటారు. వారంతా కూడా ఇతర బ్యాంకుల్లో, ఇతర గ్రూపుల్లో సభ్యులుగా ఉంటారు. అయితే ఒక్కొక్క గ్రూప్‌కి ఒక్కొక్క సభ్యురాలిని ఎంపిక చేసి... వారి పేరు మీద మరో 9 మందిని కొత్త గ్రూపులు పెట్టి. ఆ విధంగా బోగస్ గ్రూపులను చిత్రీకరించి వారి పేరు మీద పెద్ద ఎత్తున రుణాలను పొందారు. పొందిన రుణాలను బ్యాంకు మేనేజర్లు, మెప్మా సీఓలు, ఆర్పీలు పంచుకున్నారు.

నోటీసులు రావడంతో వెలుగులోకి..



గుంటూరు నగరంలోని సంగడిగుంట ప్రాంతంలో ఓ బ్యాంకు, రుణాలు చెల్లించాలని డ్వాక్రా గ్రూపులకు నోటీసులు జారీ చేసింది. నోటీసుల మీద డ్వాక్రా మహిళలు కంగుతిన్నారు. మా గ్రూప్ అది కాదని, మా గ్రూపులో ఉన్న సభ్యులెవరూ రుణాలు తీసుకోలేదని. బ్యాంకు అధికారులు ఇచ్చిన నోటీసుకు సమాధానం పంపారు. నోటీసులకు మహిళలు సమాధానం ఇవ్వటం, బ్యాంకు ఉన్నతాధికారుల పరిశీలనకు వెళ్ళటంతో అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పొన్నూరు నియోజకవర్గం, గుంటూరు ఈస్ట్, వెస్ట్‌తో పాటు జిల్లాలో అనేక ప్రాంతాల్లో బోగస్ గ్రూపులు పెట్టి, అక్రమంగా రుణాలు పొందినట్లు వెలుగులోకి వచ్చింది. దీనిపై నెల క్రితం మెప్మా అధికారులు ఇద్దరు సీఓలను సస్పెన్షన్ చేసి చేతులు దులుపుకున్నారు.

రంగంలోకి దిగిన సీఐడీ అధికారులు

డ్వాక్రా గ్రూపుల రుణాలలో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసేందుకు గుంటూరు సీఐడీ అధికారులు రంగంలోకి దిగారు. దీంతో ప్రాథమికంగా చేపట్టిన దర్యాప్తులో విస్తుబోయే అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ బోగస్ రుణాలు వెనుక బ్యాంకు ఉన్నతాధికారులు కూడా ఉన్నట్లు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన బోగస్ గ్రూపుల రుణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మొత్తం వ్యవహారాన్ని లెక్క తేల్చేందుకు దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం పొన్నూరు టౌను, పచ్చలతాడిపర్రు, అనంతవరం ఆయా ప్రాంతాల్లో ఉన్న యూనియన్ బ్యాంక్ బ్రాంచీలలో సీఐడీ అధికారులు దర్యాప్తు నిర్వహించనున్నారు.

గ్రీన్ గ్రేస్‌కు బిగుస్తున్న ఉచ్చు

- వాస్తవాలు దాచి పెట్టారంటూ నిర్మాణదారుడికి షోకాజ్ నోటీస్
- లైసెన్స్ ఇంజనీర్ కేఎస్‌ఆర్ అసోసియేట్స్‌పై చర్యలు
- రైల్వే ఎన్‌వోసీ లేకుండానే 15 ఫ్లోర్లకు దరఖాస్తు
- అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వాస్తవాలు
- అక్రమ నిర్మాణాలపై చర్యలకు రంగం సిద్ధం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర నడిబొడ్డున వైసీపీ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆ పార్టీ నేత అంబటి మురళీకృష్ణ చేపట్టిన అక్రమ నిర్మాణాలైన గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్‌పై కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. వాస్తవాలను దాచిపెట్టి అడ్డగోలుగా అనుమతులు ఉన్నాయంటూ అధికారులను భయపెట్టి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టేందుకు జీఎంసీ అధికారులు ఉచ్చు బిగిస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ ప్లాన్ కోసం దరఖాస్తు చేసిన లైసెన్స్ ఇంజనీర్ కేఎస్‌ఆర్ అసోసియేట్స్‌కు సంబంధించిన లైసెన్సును నిలుపుదల చేశారు. ఈ సంస్థను ఇప్పటికే బ్లాక్ లిస్టులో పెట్టేశారు. గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణాలకు సంబంధించి జీఎంసీకి దరఖాస్తు చేసిన ప్లాన్లలో వాస్తవాలు దాచి పెట్టారని, దీనికి సంబంధించి వివరణ ఇవ్వాలని నిర్మాణదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు

వైసీపీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని..

గుంటూరు నగరంలోని పట్టాభిపురంలో జూట్ మిల్ బజరంగ్ ప్రాంగణంలో వైసీపీకి చెందిన అంబటి మురళీకృష్ణ గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణం ముసుగులో అక్రమాలకు పాల్పడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఈ నిర్మాణాలు చేపట్టారు. జీఎంసీ నుంచి పూర్తి అనుమతులు లేకుండానే చేపట్టిన ఈ నిర్మాణాలు పూర్తి చేసే దశకు వచ్చాయి. ఈ నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని, అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఫిర్యాదు చేయటంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన నేరుగా నిర్మాణాల అక్రమాలపై ఆధారాలతో సహా ప్రెస్ మీట్ పెట్టి వివరించారు. వాటికి సంబంధించిన ధ్రువపత్రాలతో ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్‌ను, దానికి ఉన్న అనుమతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారి పరిశీలనలో అనేక లోపాలు ఉన్నట్లు గమనించారు.

5 ఫ్లోర్లని 15 చేశారు..

వాస్తవానికి ఈ భవనాల నిర్మాణం తొలుత ఐదు ఫ్లోర్లకు అని జీఎంసీ నుంచి అనుమతులు పొందారు. ఆ తర్వాత 15 ఫ్లోర్లకు అనుమతి కావాలని దరఖాస్తు చేశారు. అయితే 15 ఫ్లోర్ల అనుమతికి, వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించలేదు. దీంతో 2019-24 వరకు అధికార వైసీపీ పార్టీని అడ్డుపెట్టుకొని అక్రమ నిర్మాణాలను యథేచ్ఛగా కొనసాగించారు. వైసీపీ హయాంలో అధికారులు అటువైపు చూసేందుకు కూడా సాహసించలేదు. దీంతో నిర్మాణ పనులు మరింత వేగంగా జరిపించారు. ఎమ్మెల్యే నరేంద్ర ఫిర్యాదుతో కదిలిన అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీల చేయగా ఉన్న వాస్తవాలను వెలుగు తీశారు. ప్రధానంగా రైల్వే ఎన్‌వోసీ లేదనీ, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టేటప్పుడు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు కూడా లేవనీ, అనుమతులు లేకుండానే ఇంత పెద్ద నిర్మాణాలు చేపట్టారని నోటీసులు పేర్కొన్నారు. నిర్మాణదారు నుంచి సమాధానం వచ్చిన వెంటనే చర్యలు తీసుకునేందుకు జీఎంసీ అధికారులను సిద్ధం అవుతున్నట్లు తెలిసింది.

పాఠశాలల ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధనకు కృషి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు పాఠశాలలకు ఫైవ్ స్టార్ రేటింగ్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని డీఈవో సీవీ రేణుక తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఫైవ్ స్టార్‌లో ఒక్కటి లేదు' కథనానికి డీఈవో స్పందించారు. పాఠశాలల్లో రేటింగ్ పెంచేందుకు తరచుగా ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు విస్తృతంగా తనిఖీలు చేసి పాఠశాలల్లో ఉన్న లోపాలను గుర్తించి సరిదిద్దే పనులు చేపట్టామని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం పెంచి ఎస్ఎస్‌సీ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో ఫలితాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాం. అలానే తరగతి గదుల్లో మంచి వాతావరణం, పాఠశాలలకు ప్రహరీ గోడల ఏర్పాటు, ఇంటర్నెట్ సదుపాయం, ఫర్నిచర్, లైబ్రరీ రూంల ఏర్పాటుపై దృష్టి పెట్టామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ ప్రభాకరరావు, ఎస్ఐ కృష్ణారావు

నరసరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి వైరు చోరీ చేసే ముఠా పోలీసులకు చిక్కింది. నలుగురు నిందితులను అరెస్టు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లలో చోరీ చేసిన రూ. 3.50 లక్షల విలువైన రాగి వైరును స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రూ.2 వేలు విలువైన రాగి వైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు వరకు ఉంటుంది. దాదాపు 145 ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేశారు. వీటి విలువ దాదాపు రూ 2.50 కోట్లు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో పోలీసు శాఖ సదరు దొంగలపై ప్రత్యేక దృష్టి సారించింది. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, ఐనవోలు ఎస్ఐ కృష్ణారావు బృందం పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో నమోదైన కేసులను ఛేదించారు. పల్నాడు జిల్లాలో 19, ప్రకాశం జిల్లాలో 8, మొత్తం 27 కేసులు ఉన్నాయి. ఈ కేసులకు సంబంధించి ప్రకాశం జిల్లా అనసపాలెంకు చెందిన నల్లబోతుల పెద్ద యంగయ్య, నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామానికి చెందిన బత్తుల కోటయ్య, వినుకొండ మండలం గాంధీనగర్‌కు చెందిన వీరబోయిన బాలయ్య, రొంపిచర్ల మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన తోలుసురి లక్ష్మీ నారాయణలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 350 కిలోల రాగి వైరును స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ. 3.50 లక్షలని డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



కల్యాణి (ఫైల్)

మంగళగిరి సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ఓ మహిళా కానిస్టేబుల్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... 2018 బ్యాచ్‌కు చెందిన కల్యాణి (34) గత నాలుగు సంవత్సరాలుగా తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుంది. మంగళగిరి పట్టణంలోని మార్కండేయ కాలనీలో భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మంగళగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కల్యాణి మృతికి గల కారణాలు తెలియాల్సి వుంది.

నా భూమిని ఆక్రమించి ప్లాట్లు వేశారు

- అడ్డుకున్నందుకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు
- వైసీపీ హయాంలో రియల్టర్ల తీరుపై ప్రజాదర్బారులో ఫిర్యాదు



రియల్‌దందాపై చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న దాదా సాహెబ్

వినుకొండటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బారు కార్యక్రమంలో గత ప్రభుత్వ హయాంలో కొందరు రియల్టర్లు భూకబ్జాలకు పాల్పడ్డారంటూ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. బాధితుడి షేక్ దాదా సాహెబ్ కథనం మేరకు పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గుడ్‌షఫర్డ్ పాఠశాల సమీపంలో 2021లో 40 సెంట్లు భూములు కొనుగోలు చేశానని, గత ప్రభుత్వ హయాంలో కొందరు రియల్టర్‌లు తాను కొనుగోలు చేసిన భూమిని అమ్మలేదని తమ కుటుంబంపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని వాపోయారు. వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న కొందరు బడా నాయకులకు అప్పటి రెవెన్యూ అధికారులు, సర్వేర్లు తొత్తులుగా వ్యవహరించి రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. తాము కొనుగోలు చేసిన భూమిని ఆక్రమించుకొని ప్లాట్లు ఏర్పాటుచేశారని, ఇదేమని అడిగితే దౌర్జన్యాలు, దాడులు, తప్పుడు కేసులు పెట్టి తమ కుటుంబాన్ని వేధించారంటూ వాపోయారు. జరిగిన సంఘటనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఆక్రమదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సీఐ శోభన్‌బాబుకు సూచించారు.

ఆక్రమించి భూమిని చదును చేసి..

వెల్లటూరు రోడ్డులోని సర్వే నంబరు 251లోని 4 ఎకరాల భూమిలో గల ఎన్ఎస్‌పీ కాల్వను గత ప్రభుత్వం అండతో ప్రభుత్వ సానుభూతి పరులు అక్రమంగా ఎన్ఎస్‌పీ కాల్వ భూమిని ఆక్రమించుకొని భూమిని చదునుచేసి నిర్మాణాలు చేపట్టారు. దీంతో పెరుమాలళపల్లి మేజర్ కాల్వ నుంచి సింగరు చెరువు వరకు ఉన్న మైనర్ కాలువ కనుమరుగైంది. సర్వే నంబరు 246/4, 246/5, 251లోని ఎన్ఎస్‌పీ కాలువ భూమి సుమారు 80 సెంట్లు మేర ఆక్రమణకు గురికావడంతో స్థానికులు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. త్వరలో జిల్లా సర్వేయర్ చేత సర్వే చేయించి ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు.

మందేసి....చిందేసి...!

- బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మందు తాగుతూ...చిందేస్తూ
- బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ పుట్టినరోజు వేడుకల్లో హల్‌చల్
- వీడియోలు నెట్టింట వైరల్



మందు బాటిల్‌తో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ కార్యక్రమాల్లో మనం ప్రొటోకాల్ చూసుంటాం... ఎందుకంటే రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారికి దక్కే గౌరవం అది. కానీ ఏకంగా ఓ నేత పుట్టిన రోజు వేడుకల్లో షాంపైన్ పొంగించడానికి ఎమ్మెల్యేకు ప్రొటోకాల్ గుర్తుచేసి దానిని ఓపెన్ చేసే మహద్భాగ్యం సదరు నేతకు కల్పించడం, మందేసి చిందేయడం వీటన్నింటికీ బాపట్లలోని పాండురంగాపురం బీచ్ వేదికగా నిలిచింది. ఈ నెల 11న బాపట్లకు చెందిన బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పుట్టిన రోజు కావడంతో, పదో తేదీ అర్ధరాత్రి నుంచే పాండురంగాపురం బీచ్ వేదికగా వేడుకలకు తెర తీశారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత అనంత వర్మతోపాటు పలువురు నేతలు, అనుచరులు ఈ వేడుకల్లో భాగస్వాములైయ్యారు. వేడుకల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మందు గ్లాసు చేతిలో పట్టుకుని చిందేసిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో పాటు వారి మధ్య జరిగిన సంభాషణలు కూడా ప్రజల్లో చర్చకు దారి తీశాయి. వేడుకల్లో భాగంగా షాంపైన్ బాటిల్ ఓపెన్ చేసే క్రమంలో అన్నీ ఆయనే ఓపెన్ చేయాలా అని ఒకరంటే ప్రొటోకాల్ అని వైసీపీ నేత అనంతవర్మ అనడం, సదరు బాటిల్‌ను ఎమ్మెల్యే నరేంద్రవర్మే ఓపెన్ చేయడం ఇవన్నీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పుట్టిన రోజు వేడుకలు జరిగి వారం గడిచాక అక్కడ అంతర్గతంగా జరిగిన వీడియోలు బయటకు రావడం వెనక అక్కడ వేడుకల్లో పాల్గొన్న వారే కావాలనే వీటిని బయటకు విడుదల చేశారనే అనుమానాన్ని నేతలు వ్యక్తం చేస్తున్నారు

సాధారణమే కానీ....

ప్రైవేటు కార్యక్రమంగా జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో మందేయడం, చిందేయడం, మ్యూజికల్ నైట్ ఇవన్నీ కూడా సర్వసాధారణమే. కానీ ఆ వేడుకల్లో పాల్గొన్నది ప్రస్తుతం టీడీపీ తరఫున బాపట్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కావడంతో ఆ మందు, చిందులపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

బీహారీలు వర్సెస్ హిజ్రాలు


- చోరీకి పాల్పడిన బీహారీలను కాలనీ ఖాళీచేసి వెళ్లాలని బెదిరింపు
- ప్రతిగా హిజ్రాలపై బీహారీల దాడి
- భారీగా పోలీస్ కార్యాలయానికి చేరుకున్న ఇరువర్గాలు

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని మిర్చి యార్డు సమీపంలోని సుబ్బారెడ్డి నగర్‌లో బిహారీలు వర్సెస్ హిజ్రాల మధ్య వార్ జరుగుతుంది. సుబ్బారెడ్డి నగర్ ప్రాంతంలో బీహార్ రాష్ట్రానికి చెందిన 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారు మిర్చి యార్డులో కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అక్కడే హిజ్రాలు కూడా నివాసం ఉంటున్నారు. అయితే రెండు రోజుల క్రితం ఓ హిజ్రా ఇంటిలో బిహారీకి చెందిన వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఇది గమనించిన హిజ్రాలు ఆ వ్యక్తిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని దేహశుద్ధి చేశారు. హిజ్రా ఇంటిలో రూ. 50 వేల నగదు, మూడు సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు హిజ్రాలు నల్లపాడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే బిహారీలు అద్దెకుంటున్న ఇంటి యజమాని తాను వారి తరఫున రూ. 50వేలు ఇస్తానని ఒప్పుకుంది. అయితే మిగిలిన బంగారు ఆభరణాల విషయంపై వారి మధ్య వివాదం నెలకుంది. ఈ విషయంపై హిజ్రాపై బీహారీలు దాడి చేశారని హిజ్రాలు ఆరోపిస్తున్నారు. అయితే దొంగతనాలతో పాటు గంజాయి సేవిస్తున్నారని అందువల్ల ఈ ప్రాంతం నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ బీహారీలకు హిజ్రాలు అల్టిమేటం జారీ చేశారు. ఈ విషయంపై ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు పెద్ద సంఖ్యలో సోమవారం బీహారీలు పోలీస్ కార్యాలయానికి వచ్చారు. అందుకు ప్రతిగా పెద్ద సంఖ్యలో హిజ్రాలు కూడా పోలీస్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇరువర్గాలు ఎస్పీ కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద మోహరించగా విషయం తెలుసుకున్న నల్లపాడు సీఐ వంశీధర్ వచ్చి ఇది వర్గాలతో చర్చించి వారిని అక్కడ నుంచి వెనక్కు పంపించారు. కాగా బిహారీలు ఇరువురు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తమను ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని హిజ్రాలు బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులు తాళలేక ఆరేపల్లి మాధవి (26) ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టాభిపురం పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మోటమర్రు సంధ్య ఆమె చెల్లెలు ఆరేపల్లి మాధవిల తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. ఇరువురు అక్కచెల్లెళ్ళను అమ్మమ్మ పెంచి పెళ్లిళ్ల చేసింది. 2013 మే 30న మాధవికి కోబాల్డ్‌పేటకు చెందిన ఈశ్వరబాబుతో వివాహంతో జరిగింది. వారికి ఇద్దరు కుమారులు సంతానం ఉన్నారు. మద్యానికి బానిసైన ఈశ్వర్ బాబు నిత్యం భార్యను శారీరకంగా, మానసికంగా తీవ్రంగా హింసిస్తున్నాడు. ఇంటిలోని వస్తువులు కూడా అమ్మేసుకున్నాడు. భర్త వేధింపులు భరించలేని మాధవి ఈ నెల 8న మధ్యాహ్నం 12 గంట సమయంలో పట్టాభిపురం 2, 3 లైన్ల మధ్య ఉన్న ప్రభుత్వ మున్సిపల్ హైస్కూల్ సమీపంలో ఎలుకలు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే ఆమెను జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందిందన్నారు ఈ మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సహాయనిధికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తాడేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని నివాస గృహంలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి ఏపీ టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.4,01,116లు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. మంత్రి లోకేశ్ వీరిని అభినందించారు.

నీటికుంటలో గల్లంతైన విద్యార్థి మృతి

మేడికొండూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నీటికుంటలో గల్లంతైన బీఫార్మసీ విద్యార్థి మూల్పూరి రంజిత్ (21) మృతి చెందాడు. మేడికొండూరు మండలం, భీమినేనివారిపాలెంలోని ఓ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మూల్పూరి రంజిత్ కళాశాల సమీపంలోని నీటికుంటలో ఆదివారం ఈతకు దిగి గల్లంతైన విషయం విదితమే. సోమవారం నీటి కుంటలో గాలించిన పోలీసులకు రంజిత్ మృతదేహం లభించింది. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కళాశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగానే విద్యార్థి రంజిత్ మృతి చెందాడని ఆగ్రహిస్తూ పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు విద్యార్థి కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. కళాశాల ఆవరణలో మృతదేహాన్ని ఉంచి ధర్నా నిర్వహించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం తరువాత మృతదేహం తరలించడానికి ఎమ్మార్పీఎస్ నాయకులు అంగీకరించారు.

చిన్నారులపై.. చలి పంజా

(5వ పేజీ తరువాయి)

ఇన్‌ఫ్లుయెంజా ఏ, బీ అనే రెండు రకాలు ఉంటాయి. ఏ రకం ఊపిరితిత్తులపై ప్రభావం చూపడంతో పాటు అలసట, జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలను కలిగిస్తుంది. చలి కాలంలో ఇది విజృంభిస్తుంది. రోగుల దగ్గులు, తుమ్ముల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులువుగా వ్యాపిస్తాయి. "నగరంలో ఫ్లూ బాధిత చిన్నారుల్లో మధ్య తరహా వ్యాధి లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయి. బాధితులు ఆసుపత్రుల్లో చేరి చికిత్సలు పొందాల్సినంత తీవ్రస్థాయిలో వ్యాధి లక్షణాలు లేవని" గుంటూరు జీజీహెచ్ పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రికి వస్తున్న కేసుల్లో వ్యాధి లక్షణాలు తీవ్రంగా ఉన్న వారిని మాత్రం అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందిస్తున్నట్లు ఆయన వివరించార

జాగ్రత్తలు ఇవీ...

- పెద్దలు ఏడాదిలోపు చిన్నారులను పట్టుకునే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. మాస్క్ ధరించాలి. తల్లిపాలే శిశువులకు అందించాలి
- ఏడేళ్లలోపు పిల్లలను సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఏడు గంటల వరకు బయటకు తీసుకెళ్లకూడదు.
- రాత్రి సమయాల్లో ఏసీల వినియోగం పూర్తిగా మానేయాలి. చిన్నారులు నిద్రించే గదుల్లో ఫ్యాన్ల వేగం తగ్గించాలి
- చలి కాలంలో ఐస్‌క్రీములు, కూల్‌డ్రింకులు వంటి చల్లని పదార్థాలను పిల్లలకు ఇవ్వకూడదు. గోరువెచ్చని నీళ్లు తాగించాలి
- ఐదేళ్లు వచ్చే వరకు ప్రతి ఏడాది ఫ్లూ వ్యాక్సిన్ ఇప్పించడం మంచిది. ఆస్తమా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇన్‌హేలర్లు వినియోగించాలి.
- చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచేలా పోషకాహారం అందించాలి.

తక్కువ వ్యాధి నిరోధక శక్తి ఉండటం వల్లే చలికాలంలో ఎక్కువగా వ్యాధుల బారిన పడతారు.

- మూడు రోజులకు మించి జలుబు, దగ్గు ఉంటే వైద్యుడిని సంప్రదించి చికిత్సలు చేయించాలి.

బేస్‌బాల్ విజేతలుగా గుంటూరు జట్లు



విజేత బాలిక జట్టుకు కప్పు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధూళిపాళ్ళ సమీపంలో గల లయోల ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి అండర్ - 19 స్కూల్ గేమ్స్ బేస్ బాల్ పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. కాగా సోమవారం పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని విజేతలు ట్రోఫీలను అందజేశారు. ముందుగా ఆయన మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని అన్నారు. క్రీడల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో సానుకూలంగా పని చేస్తున్నారన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను రెండు నుంచి మూడు శాతానికి పెంచటం క్రీడాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. తాను కూడా ఒకప్పుడు క్రీడాకారుడినేనని, క్రీడాకారులు పడే ఇబ్బందులు తనకు తెలుసునన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానం గుంటూరు జిల్లా జట్టు, రెండో స్థానం పశ్చిమ గోదావరి జిల్లా జట్టు, మూడో స్థానం విజయనగరం జిల్లా జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి స్థానం గుంటూరు జిల్లా, రెండవ స్థానం శ్రీకాకుళం జిల్లా, మూడవ స్థానం విజయనగరం జిల్లా జట్లు నిలిచాయి. విజేత జట్లకు ఎమ్మెల్యే కన్నా ట్రోఫీ, ప్రశంసా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి జీ నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, టోర్నమెంట్ పరిశీలకులు పీ నాగేంద్రం, యూ నీలిమ, కళాశాల డైరెక్టర్ వంశీ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు, పీఈటీలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత రైతుల బాండ్ల తనిఖీ



కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యం ఇచ్చిన బాండ్‌లను అధికారులకు చూపుతున్న బాధిత రైతులు

దుగ్గిరాల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గతేడాది జనవరి 19న స్థానిక శుభం కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు సంబంధించిన బాండ్‌లను బీమా సంస్థ బృందం సోమవారం తనిఖీ చేసింది. నష్టపోయిన రైతులకు కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం పరిహారం అందించకపోవడంతో పలువురు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. కోట్లాది రూపాయలను నష్టపోయినప్పటికీ సరైన స్పందన లభించక పోవడంతో అప్పటి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అర్హులైన రైతులను గుర్తించి వారందరికీ న్యాయం చేసేందుకుగానూ, అధికారులు, రైతులు, రైతుసంఘాల నాయకులతో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. వచ్చే జనవరి 19నాటికి ఏడాది కావస్తుండగా నేటికీ పంటబీమాకు సంబంధించి ఎలాంటి ప్రకటన రాలేదని రైతులు ఆందోళన చెందుతూ వచ్చారు. 400 మందికిపైగా రైతులకు సంబంధించిన పసుపు నిల్వలపై కోట్లాది రూపాయల పరిహారం అందించే క్రమంలో భాగంగా ఇండియా ఇన్స్యూరెన్స్ సంస్థకు సంబంధించి రైతుల వద్దనున్న బాండ్లను పరిశీలించేందుకు వచ్చినట్లు ప్రతినిధి జుబేర్ ఆలీఖాన్ సోమవారం తెలిపారు. కచ్చితమైన బాండ్లను కలిగి అర్హులైన రైతులను గుర్తించి నివేదికను ప్రభుత్వానికి, బీమా సంస్థకు అందజేస్తామని చెప్పారు.

అట్టహాసంగా ఎడ్లబండలాగుడు పోటీలు



ప్రథమస్థానం సాధించిన నంద్యాల ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. మొదటి రోజైన సోమవారం సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించగా నంద్యాల మండలం పెదకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎడ్లజత పందెపు బండను నిర్ణీత సమయంలో 3439.6 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పెదపులిపాకకు చెందిన గరికపాటి శ్రీధర్ ఎడ్లజత 3200 అడుగులతో రెండోస్థానం, తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా, పెనమలూరు మండలం, యాదిరెడ్డిపల్లికు చెందిన డాక్టర్ అకిలేష్‌రెడ్డి ఎడ్లజత 3090.3 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 3045.2 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పులగం జశ్వితారెడ్డి ఎడ్లజత 2800 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి సాధించిన ఎడ్లజతకు విక్టర్ బయో జెనిటిక్స్ ఎండి తోట శ్రీనివాసరావు రూ. లక్ష బహుమతిని అందించారు. కాగా మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. పట్టణానికి చెందిన దివ్యాంగుడు గాలయ్యకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎలక్ట్రికల్ ట్రైసైకిల్‌ను అందించారు.

నీటి కుంటలో పడి ఇద్దరు మృతి



ఆసుపత్రిలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో పడి ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలోని పులిపాడు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పులిపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, మాధవి దంపతుల కుమారుడు సుభాష్ (11) దాచేపల్లి పట్టణంలోని ఓ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం బడికి వెళ్లేందుకు స్కూల్ బస్సు ఎక్కాడు. గ్రామం నుంచి కొంత దూరం వెళ్లాక బస్సు డ్రైవర్ కోటేశ్వరరావు రేడియేటర్‌లో నీళ్లు అయిపోవడంతో రోడ్డు పక్కన బస్సు నిలిపాడు. రోడ్డు పక్కన ఉన్న నర్సరీ వద్ద గల నీటి కుంటలో నీరు తేవాలని దాచేపల్లి మండలం ఇరికేపల్లికి చెందిన బస్సు క్లీనర్ కోటేశ్వరరావు (55)కు చెప్పారు. అయితే నీటి కోసం బాలుడు సుభాష్, క్లీనర్ కోటేశ్వరరావు వెళ్లారు. అయితే సుభాష్ నీటికుంటలో దిగి మునిగిపోయాడు. సుభాష్‌ను కాపాడే క్రమంలో నీటికుంటలోకి దిగిన క్లీనర్ కోటేశ్వరరావు కూడా కుంటలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కర్, ఎస్ఐ వినోద్ సంఘటనా ప్రదేశానికి వెళ్లి మృతదేహాలను వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పరామర్శించిన ఎమ్మెల్యే యరపతినేని

ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సందర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

ఘనంగా శ్రీరామ కోటి మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్‌నగర్ శ్రీరామ నామ క్షేత్రంలో 98వ శ్రీరామ కోటి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ధనకుదరం సీతారామానుజాచార్యులు విచ్చేసి శ్రీరామ పతాకావిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభించి, అనుగ్రహ భాషణం చేశారు. ఆలయ అర్చకులు అంకురారోపణ పూజ కార్యక్రమం, అఖండ జ్యోతి స్థాపన చేశారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్ని రామనామ క్షేత్రం కార్య నిర్వాహకులు రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు పర్యవేక్షించారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న సీతారామానుజాచార్యులు

తిరుప్పావై ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ వారి సౌజన్యంతో ధనుర్మాసం పురస్కరించుకుని సోమవారం తిరుప్పావై పై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం ధనుర్మాసం సందర్భంగ గోదా అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కేవీ శ్రీరంగనాయకి తిరుప్పావై పై ప్రవచనం చేస్తూ ధనుర్మాస విశిష్టత, కాత్యాయిని వ్రతం విశిష్టతను, గోదాదేవి అమ్మవారి ఆవిర్భావంను, మొదటి పాశురంలోని విశేషాలు, విష్ణుచిత్తుని విశేషాలు సవివరంగా తెలియజేశారు.

ఎస్సీ వర్గీకరణపై వినతుల స్వీకరణకు ఏకసభ్య కమిషన్

గుంటూరు విద్య డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై విచారణ చేసేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకసభ్య కమిషన్ కార్యాలయం, విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు, మొదటి అంతస్తు, మొగలరాజుపురం, కోనేరు లక్ష్మయ్య వీధి, విజయవాడ-520010 చిరునామాలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై రాతపూర్వక వినతులను ఏకసభ్య కమిషన్ ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కార్యాలయ పనివేళల్లో జనవరి 9వ తేదీ వరకు స్వీకరిస్తారని తెలిపారు. అర్జీలను వ్యక్తిగతంగా, రసీదుతో కూడిన రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించవచ్చునని తెలిపారు. అర్జీలను షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఏకసభ్య కమిషన్ వారికి omcscsub-classification@gmail.comఅనే మెయిల్ ద్వారా కూడా పంపవచ్చన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

గుంటూరు విద్య, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మంగళవారం నుంచి ఐపీఎస్ జిఎం-2024 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి సీబీడీ డీఎస్సీ జి.లక్ష్మయ్య, డీఈవో సీవీ రేణుక, పీవీఆర్ చలపతి మెటల్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ పిల్లా వెంకటేశ్వరరావు, పి.నరసింహారెడ్డి తెలిపారు. ఎస్‌బీయూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్ ప్రియా పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు.

కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఈవోగా మాధవి

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఈవోగా జి.మాధవిని నియమిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కే.రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె గుంటూరు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్నారు. ఆమెకు బాధ్యతలను అప్పగిస్తూ అమ్మవారి గుడికి ఈవోగా నియమించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా ఉన్న దుర్గారావు ను నంబూరు గ్రూప్ టెంపుల్‌కి పరిమితం చేశారు.

మహిళపై హత్యాయత్నం

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణం కోసం తన నుంచి అప్పుగా తీసుకున్న లక్ష రూపాయలు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు తనపై ప్రమాదకరమైన ఆయిల్ పోసి నిప్పంటించి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఎన్టీఆర్ కాలనీ ఒకటో లైన్‌కు చెందిన జరకుల ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నాగేశ్వరావు, లక్ష్మీ దంపతులు నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నామని అడగ్గా నాలుగేళ్ల క్రితం ప్రమీల లక్ష రూపాయల అప్పుగా ఇచ్చింది. ఆ డబ్బు తిరిగి ఇవ్వమన్నందుకు ఈనెల 15న రాత్రి 7 గంటల సమయంలో వారిం టికి డబ్బులు అడగడానికి వెళ్లగా అక్కడ వారు ప్రమాదకరమైన పెట్రోల్ లాంటి ఆయిల్ పోసి నిప్పంటించారన్నారు. దీంతో జీజీహెచ్‌లో చేరిన ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 162 అర్జీలు
- పరిష్కరించాలంటూ ఆదేశాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 162 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారితో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అసమగ్ర సమాచారంతో పిటిషన్ పరిష్కరిస్తే సదరు అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేసీ భార్గవతేజ్ మాట్లాడుతూ కోర్టు కేసులను సమీక్షిస్తూ, ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం అండ్‌హెచ్‌వో విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డీపీవో నాగసాయి కుమార్, డీసీవో వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలి

నగరంలో అంజుమన్ ఈ ఇస్లామియా సొసైటీ కమిటీ ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని ప్రజా సేవ సమితి పార్టీ ఆధ్వర్యంలో షేక్ రహీం అర్జీ అందజేశారు. ఎన్నికలు నిర్వహించకుండా అధికారులు వక్ఫ్ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. కేర్ టేకర్స్ అంటూ కమిటీని ఏర్పాటు చేసి ఎన్నికలు లేకుండా చూస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికలను నిర్వహించాలని కోరారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్‌తేజ తదితరులు

జాతీయ ఇంధన వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

గుంటూరు విద్య, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా రూపొందించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి సోమవారం ఆవిష్కరించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్ ఆదాను ప్రతి ఒక్కరూ పాటించి భావితరాలకు ఇంధన వనరులను అందించాల్సి ఉందన్నారు. ఈనెల 20 తేదీ వరకు జరిగే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలపై ప్రజలకు విరివిగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఎస్ఈ ఆపరేషన్ ఏవీఎల్ఎన్ మూర్తి, సీఆర్డీఏ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, ఈఈ శ్రీనివాసబాబు, నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ వి.కృష్ణారెడ్డి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ముస్తాక్ అహ్మద్, హుస్సేన్ ఖాన్, గురవయ్య పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజల అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- అధికారులను ఆదేశించిన కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలు రీ ఓపెన్ కాకుండా సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో సోమవారం డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 23 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్ కి అందిన ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు.

సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 47 ఫిర్యాదులు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 19, ఇంజినీరింగ్ విభాగం 14, రెవెన్యూ విభాగం 8, ప్రజారోగ్య విభాగం 1, అకౌంట్స్ 3, ఉపా సెల్ విభాగానికి సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, సిటి ప్లానర్ రాంబాబు, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

నూతన రోడ్లు ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో నూతన రోడ్లను డ్రెయిన్ టు డ్రెయిన్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, డ్రెయిన్ కల్వర్ట్‌పై తప్పనిసరిగా మ్యాన్ హోల్ ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ గార్డెన్స్, విజయపురి కాలని, నవభారత్ నగర్, వికాస్ నగర్, ఎల్ ఆర్ కాలనీ, వాసవినగర్ ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల వారీగా ఎక్కడైనా రోడ్లు ప్యాచ్ వర్క్ చేయాలని గుర్తిస్తే ఎప్పటికప్పుడు చేపట్టాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య చెరువులో రిటైనింగ్ వాల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ వెంట ఔషధ మొక్కలను నాటించాలన్నారు. నవభారత్ నగర్ 2వ లైన్‌ని పరిశీలించి, నూతన రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ వి.శ్రీరామ్ ప్రసాద్, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు చైతన్య, రవి కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో సుమేధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి తదితరులు

గుంటూరు విద్య, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్జీవో కాలనీలోని సుమేధ స్కూల్‌లో విద్యార్థులు జాతీయ స్థాయిలో రెయిన్‌బో ఆర్ట్స్ అకాడమి నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో బహుమతులు సాధించారని డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో 31 బంగారు, 34 వెండి, క్యాంస పతకాలు విద్యార్థులు సాధించారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

విభిన్న ప్రతిభావంతుల ఏడీపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల మధ్య విభేదాలు సృష్టిస్తున్న దివ్యాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ జిల్లా అసిస్టెంట్ డైరక్టర్ సువార్తపై చర్యలు తీసుకోవాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభిన్న ప్రతిభావంతులు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు వెలుగు శివప్రసాదు మాట్లాడుతూ స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న స్థలం విభిన్న ప్రతిభావంతులదని, కేవలం అంధులది కాదని స్పష్టం చేశారు. పక్షపాత వైఖరిని అవలంభిస్తున్న ఏడీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా కమ్యూనిటీ హాల్‌కు పూర్తి వ్యతిరేఖమని విజువల్లి ఛాలెంజడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంధులు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. వికలాంగుల కమ్యూనిటీ హాల్‌ను మరో చోట ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ స్థలం విషయంలో అయా సంఘాల నాయకులు, జిల్లా అధికారులతో కలిసి త్వరలోనే కమిటీని ఏర్పాటు చేస్తామని, నివేదిక అందగానే నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గం, ఉద్యోగులు, రైతాంగం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యే వరకు నిరంతరం పోరాటాలు జరుపుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా మహాసభల్లో అమోదించిన తీర్మానాలను ఆయన వెల్లడించారు. గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు పట్టణాలలో తాగునీరు, రోడ్లు, మురుగుకాల్వలు, గుంటూరులో భూగర్భ డ్రైనేజి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గానికి కనీసవేతనాలు, బోనస్, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టం సక్రమంగా అమలు చేసి పనులు కల్పించాలన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా నేతాజి

అంతకుముందు జిల్లా మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శిగా వై.నేతాజిని, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా పాశం రామారావు, ఎన్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, కె.నళినీకాంత్, ఎం.రవి, బూరగ వెంకటేశ్వర్లుతో పాటు మరో 14 మందిని కమిటీ సభ్యులుగా, మొత్తం 21 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తెలుగునాడు యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా అప్పారావు



మాదల అప్పారావు

గుంటూరు సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా మాదల అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూ రులో జరిగిన తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూ నియన్ సర్వ సభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శిగా టి.రామసీత, వర్కింగ్ ప్రెసి డెంట్‌గా టి.శ్రీనివాసరావు, కోశాధికారిగా కోశాధికారిగా ఎస్ఎస్ సురేష్ కుమార్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ మహమ్మద్ సుభాని, వైస్ ప్రెసిడెంట్‌లుగా డి.మాధవి, డి.శ్రీలక్ష్మీ, ఎం.నిర్మల జ్యోతి, అనూష, జాయింట్ సెక్రెటరీలుగా జి.కృష్ణవేణి , ఎం.సుజాత, జి.నలిని, డి.రాజ్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా నూతన అధ్యక్షుడు అప్పారావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవిశ్రాంతంగా పోరాటం చేస్తామని చెప్పారు.

విదేశాల్లో ఉన్నత చదువులకు పంపిస్తానని డబ్బులు తీసుకొని మోసం

గుంటూరు, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : విదేశాల్లో ఉన్నత చదువుల కోసం పంపిస్తానని చెప్పి తన నుంచి ఎనిమిదిన్నర లక్షల డబ్బులు తీసుకుని మోసం చేశారంటూ నల్లపాడుకు చెందిన యనమల హోసన్నా స్టీఫెన్ అనే యువకుడు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. విదేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లాలనుకుంటున్న క్రమంలో తమకు తెలిసిన గాజుల గోవింద్ అనే తనను హైదరాబాదులోని ఓ కన్సల్టెన్సీకి తీసుకువెళ్లాడన్నారు. ఆ కన్సల్టెన్సీని చందు ప్రసాద్, భారతి అనే ఇరువురు నిర్వహిస్తున్నారని చెప్పి ఆస్ట్రేలియాలో కాలేజీలో అడ్మిషన్ పొందడం కోసం ఎనిమిదిన్నర లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడన్నారు. తమ నుంచి డబ్బులు తీసుకుని మోసి చేసి తిరిగి ఇవ్వాలని అడుగుతుంటే ఇవ్వకపోగా, చేతనైనది చేసుకోమని తనను బెదిరిస్తున్నారని బాధితుడు స్టీఫెన్ తన ఫిర్యాదులో వాపోయాడు.

ఉద్యోగం ఇప్పిస్తానని..

తన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని తమ నుంచి రెండు లక్షల తీసుకొని ఆర్‌వీఎస్ ప్రసాద్ మోసం చేశాడని నల్లకుంట 5వ లైన్ కు చెందిన గోగుల వెంకటేశ్వరరావు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తనకు మార్కాపురంనకు చెందిన వైసీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డితో పరిచయం ఉందని ఆయన ఉద్యోగం ఇప్పిస్తాడని చెప్పి తన నుంచి ప్రసాద్ రెండు లక్షలు తీసుకున్నాడన్నారు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు అడుగుతుంటే తనకు లోకేష్ తెలుసు అని, నీకు చేతనైంది చేసుకోమని బెదిరిస్తున్నాడని తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని..

ప్రభుత్వ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని తన నుంచి ఐదు లక్షల డబ్బులు తీసుకోవడమే కాకుండా వివిధ శాఖల్లో నెలలు తరబడి పనులు చేయించుకొని మోసం చేశారని నగరంలోని విద్యానగర్ ఒకటో లైన్ కు చెందిన గొర్రెముచ్చు స్టాలిన్ బాబు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తాను సీడ్ టెక్నాలజీ డిప్లమో పూర్తి చేసి గుంటూరులో ఉద్యోగం చేస్తుండగా, తన అక్క తబిత ద్వారా ఆమెకు పరిచయమైన నాజ్ సెంటర్ పిహెచ్ సీ లో లాబ్ టెక్నీషియన్ గా పని చేసే కొచ్చర్ల లావణ్య తన భర్త ద్వారా ప్రభుత్వ శాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించిందన్నారు. లావణ్య భర్త జోషిబాబు తన నుంచి గత ఏడాది ఐదు లక్షలు తీసుకొని తెనాలి రెవెన్యూ డిపార్టుమెంట్లో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడన్నారు. ఆ తర్వాత జోషి బాబు, ప్రవీణ్ కృష్ణా జిల్లా మొవ్వ మండలం ఆవిరిపూడి గ్రామానికి తీసుకువెళ్లి అక్కడి గ్రామ సచివాలయంలో ప్రదీప్ అనే సర్వేయర్‌ను పరిచయం చేశారన్నారు. అక్కడ పది రోజులు ట్రైనింగ్ పూర్తయిన తర్వాత తెనాలిలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి సర్వేయర్ ప్రదీప్, వీఆర్వో శ్రీనివాసరావు మూడు నెలలు తన చేత రీసర్వే పనులు చేయించుకున్నారన్నారు. జీతం గాని, ఉద్యోగం కానీ ఇవ్వపోవడంతో గట్టిగా అడగ్గా అందరూ కలిసి బెదిరిస్తున్నారన్నారు.

నా భర్తను కడప రిమ్స్ పోలీసులమని నిర్బంధించి కొట్టారు

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొందరు కడప రిమ్స్ పోలీసులమని చెప్పుకుంటూ సివిల్ డ్రెస్‌లో వచ్చిన వ్యక్తులు తన భర్తను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని గుగ్గిళ్ళ త్రివేణి అనే మహిళ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను, కుటుంబ సభ్యులం వారికి అడ్డుపడగా నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. ఆ సమయంలో ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో ఇద్దరు కానిస్టేబుల్స్ ఉండగా వారికి కడప రిమ్స్ పోలీసులమని చెప్పి వేరే కేసు ఎఫ్ఐఆర్ చూపించి తన భర్తను అక్రమంగా తీసుకువెళ్లారన్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి కొద్ది దూరం వెళ్లిన తర్వాత తీవ్రంగా కొట్టారన్నారు. ఆ తరువాత నేరుగా కడపలోని డీటీసీకి తీసుకువెళ్లి అక్కడ కూడా థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురి చేశారన్నారు. తాము విషయం తెలుసుకొని మీడియా ప్రతినిధులతో అక్కడికి వెళ్లగా తన భర్తను తిరిగి కడప రిమ్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారన్నారు. అక్కడ తన భర్తతో స్టేట్మెంట్ రికార్డు చేసి పంపారన్నారు. కడప పోలీసులు తమకు చూపించిన ఎఫ్ఐఆర్ ఈ ఏడాది మే నెల 21వ తేదీన నమోదైన క్రైమ్ నెంబర్ 140/ 2024 గా ఉందన్నారు. ఆకేసుతో తమకు సంబంధం లేదన్నారు. ఆ కేసులో మారుతి షిఫ్ట్ కారు చోరీకి గురైనట్లుందన్నారు. తన భర్త అక్కడ మహమ్మద్ నవీద్‌కు చెందిన కార్ షోరూమ్‌లో ఆడిటర్‌గా పని చేశారన్నారు. ఆ సమయంలో ఆయనకు తనకు తెలిసిన వారి ద్వారా డబ్బులు కోటిన్నర వరకు అప్పుగా ఇప్పించాడని ఆ డబ్బులు తిరిగి అడుగుతున్నందుకు తన భర్తను పోలీసులతో అక్రమంగా కడప తీసుకువెళ్లి నిర్బంధించి కొట్టారన్నారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్టు : గంజాయి స్వాధీనం

స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 6/13లోని ఎల్ఈఎం స్కూల్ సమీపంలో గంజాయి కలిగి ఉన్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వసంత రాయపురం ఒకటో లైన్‌కి చెందిన రౌడీ షీటర్ చిలక రాజ్‌కుమార్, డొంక రోడ్డు 1వ లైనుకు చెందిన కొట్టపు రత్నరాజు అనే ఇద్దరు ప్లాస్టిక్ కవర్‌లో 120 గ్రాముల గంజాయితో వెళ్తుండగా పోలీ సులు దాడి చేసి పట్టుకున్నారు. వారిని విచారించగా సంజీవయ్యనగర్‌కి చెందిన రాజేంద్ర వద్ద రెండు వేల రూపాయలకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై కేసు నమోదు

తనకు బంధువైన బాలికను ప్రేమ పేరుతో కిడ్నాప్ చేసి మోసం చేసిన నిందితుడైన చల్లావారిపాలేనికి చెందిన అవినాష్‌పై నల్లపాడు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. రెం డు రోజుల క్రితం అవినాష్ గుంటూరులో జూనియర్ ఇంటర్ చదువుతున్న బాలికను ఆమె కళాశాల నుంచి బయటకు తీసుకెళ్లాడు. గమనించిన బంధువులు పట్టుకొని ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో ఎక్కిన బిహారీలను కొట్టి దోపిడీకి పాల్పడిన డ్రైవర్లు

ఆటోలో ఎక్కిన ఇద్దరు బిహార్‌కు చెందిన ప్రయాణికులను దారి మళ్లించి వారిపై దాడి చేసి సెల్‌ఫోన్‌లు, నగదు గుంజుకున్న ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. బిహార్‌కు చెందిన ప్రకాష్, ఆయన స్నేహితుడు రాజు ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో ఎక్కారు. వారు అంకిరెడ్డిపాలెం సమీపంలోని సాయి విఘ్నేశ్వర డెయిరీ ఫామ్‌లో పనిచేస్తున్నారు. అక్కడికి వెళ్లాల్సి ఉండగా ఆటో డ్రైవర్లు వారిని పొత్తూరు సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లి కొట్టి వారి నుంచి సెల్ ఫోన్‌లు, నగదు గుంజుకుని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ పాలనలో దెబ్బతిన్న వ్యవసాయ రంగం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిన్నదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. తాడికొండ నియోజకవర్గ నీటి సంఘాల ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ సభ్యుల అభినందన సభను సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయగా, కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగం మీద పూర్తిగా దృష్టి సారించిందన్నారు. నాగార్జున సాగర్ చివరి భూములు తాడికొండ నియోజకవర్గానికి చెందినవేనని, కాలువలు బాగుచేయించి చివరి భూముల వరకు నీరు అందించడానికి కృషి చేస్తామని అన్నారు. కౌలు రైతులకు బీమా, సబ్సిడీ చేపించి వ్యవసాయ పనిముట్లు సరఫరా చేస్తామన్నారు. రాజధానిలో 32 వేల కోట్ల రూపాయల పనులు జరగనున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, జనసేన జిల్లా కార్యదర్శి తడవర్తి కేశవ్, నూతలపాటి రామారావు, గుంటుపల్లి మధుసూదనరావు, నార్నె శ్రీనివాసరావు, పుట్టి రామచంద్రరావు, అబ్దుల్ గని, తలశిల ప్రసన్న కుమార్, మండవ చిన నరసింహారావు, మల్లిపెద్ది రమేష్, పాములపాటి శివన్నారాయణ, మైనేని గిరిజ తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్

వైద్య, ఆరోగ్య శాఖలో సమస్యలను పరిష్కరించండి

- 'పెమ్మసాని' కి తెలుగునాడు ఉద్యోగుల వినతి

గుంటూరు సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ తప్పిదాల వల్ల రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు విజ్ఞప్తి చేశారు. తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి ఆధ్వర్యంలో ఉద్యోగులు కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. 143 జీఓ వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జీఎన్ఎం శిక్షణ పొందిన వారికి ప్రమోషన్‌ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 22 ఏళ్ల పాటు ఆరోగ్య శాఖ లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేసిన హెల్త్ అసిస్టెంట్ లను విధుల నుంచి తొలగించారని భానుమూర్తి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. యూనియన్ నాయకులు వివరించిన వినతులపై సానుకూలంగా స్పందించిన మంత్రి పెమ్మసాని సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కు వైద్య ,ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలు వివరిస్తున్న తెలుగు నాడు యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

- ఆర్‌సీటీ అమరావతి బెంచ్ జ్యూడీషియల్ మెంబర్ ఆర్ సత్యభామ

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లలో సత్వర న్యాయం లభిస్తుందని రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అమరావతి బెంచ్ జ్యూడీషియల్ మెంబర్ ఆర్ సత్యభామ అన్నారు. సోమవారం అరండల్‌పేట ఒకటో లైనులోని ఆర్‌సీటీలో లోక్ అదాలత్ రెండో దశ ప్రారంభమైంది. ఈ నెల 18వ తేదీ వరకు అదాలత్ కొనసాగుతుందని న్యాయాధికారులు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు సంబంధించి క్లెయిమ్‌ల పరిష్కారం కోసం ఈ లోక్ అదాలత్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొత్తం 14 క్లెయిమ్ కేసులను లిస్టింగ్ చేశామని వాటిల్లో సోమవారం 12 చనిపోయిన కేసులు, ఒకటి తీవ్రగాయాలైన కేసుని పరిష్కరించామన్నారు. మూడు రోజుల్లో 55 కేసులు పరిష్కరించడానికి లక్ష్యంగా పెట్టుకొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీటీ అమరావతి బెంచ్ సాంకేతిక సభ్యుడు జీ జాన్ ప్రసాద్, సీసీఎం రవి పీ పడి, అదనపు రిజిస్ట్రార్ కే రాజేంద్రప్రసాద్, సీసీఎం సీ నాగేంద్రప్రసాద్, డీసీఎం కమలాకర్‌బాబు, ఏసీఎం ఆర్‌వీ మోజెస్ క్రిష్టియన్ పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారులు

డాక్టర్ ఓవీ రమణకు వైద్య భూషణ్ జాతీయ పురస్కారం

- ఘనంగా సత్కరించిన జస్టిస్ చంద్రయ్య



డాక్టర్ ఓవీ రమణను సత్కరిస్తున్న జస్టిస్ చంద్రయ్య, కృష్ణఆదిశేషు తదితరులు


గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఓవీ రమణ వైద్య భూషణ్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాదులో ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వారు సోమవారం ఘనంగా సత్కరించి ఈ అవార్డు ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ చంద్రయ్య, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు పి.కృష్ణ ఆదిశేషుల చేతుల మీదగా అందజేశారు. జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ వైద్యసేవలలోనే విస్తృతంగా సేవలు అందించడమే కాకుండా, మానవసేవే మాధవ సేవ అన్నమాట ప్రకారం ఆధ్యాత్మిక సేవతో పాటు వృద్ధాశ్రమం, అనాధ శరణాలయం, గోశాలలు నెలకొల్పి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై సబ్ కమిటీని నియమించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షన్ల సమస్యలపై ఈ నెల 19వ తేదిన జరిగే క్యాబినెట్ సమావేశంలో చర్చించడానికి సబ్ కమిటీని నియమించాలని ప్రభుత్వాన్ని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. సోమవారం స్థానిక మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రూ.25 వేల కోట్ల బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. అంతేగాక 12వ వేతన సవరణ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కరీముల్లా శాఖ్రి, మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, వై. నాగేశ్వరరావు, సాంబశివారెడ్డి, భరత్‌కుమార్, నీలిమరోజా, సంపూర్ణ పాల్గొన్నారు.

చరిత్ర చూసొద్దాం రండి..


మహాచైత్యం నమూనా



కేంద్ర పురావస్తు సంగ్రహాలయం

● సజీవ సాక్ష్యాలుగా చారిత్రక ఆధారాలు

అమరావతిలో భారతప్రభుత్వం నిర్వహిస్తున్న పురావస్తు ప్రదర్శనశాల(మ్యూజియం) ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందింది. అమరావతిలో బౌద్ధమతం క్రీ.శ 14వశతాబ్దం వరకు ఆదరణ పొందింది. అందుకు సంబంధించిన ఆధారాలు, బుద్ధుని ధాతువులను ఉంచి, నిర్మించిన మహాచైత్యం దీనికి నిదర్శనం. ప్రస్తుతం అది శిథిలం అయినప్పటికీ దానిపై ఏర్పాటు చేసిన శిల్పసంపద, అమరావతి శిల్పకళను ప్రపంచానికి తెలియజేసింది. ఇవన్నీ ఇక్కడి మ్యూజియంలో చూడవచ్చు. అంతే కాకుండా రాతియుగంలో మానవులు వాడిన ఆయుధాలు, శిలాయుగంలో వాడిన ఆయుధాలు, నవీన యుగంలో వాడిన మట్టిపాత్రలు ఈ ప్రదర్శనశాలలో ఉన్నాయి. మన రాష్ట చిహ్నం పూర్ణకుంభం కూడా అమరావతి శిల్పకళలో వెలుగుచూసిందే. వీటితోపాటు బుద్ధుని జీవిత ఘట్టాలను మ్యూజియంలోని శిల్పాలవలన ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. శాతవాహనుల కాలంనాటి నాణాలు కూడా ఇక్కడ భద్రపరిచారు.

మ్యూజియంలో ప్రవేశానికి 15 సంవత్సరాలు దాటినవారికి 5 రూపాయలు చెల్లించాలి. శుక్రవారం సెలవు. అమరావతి చేరుకోవడానికి విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, క్రోసూరు ప్రాంతాల నుండి రహదారి మార్గాల ద్వారా చేరుకోవచ్చు.


మట్టిపాత్రలు


బుద్ధుని రాతి శిల్పం


తవ్వకాలలో లభించిన గాంధార శిల్పం


పూర్ణకుంభం


పూర్వీకులు వినియోగించిన చేతి కడియాలు



అశోకుని కాలం నాటి ధర్మచక్రం



శాతవాహనకాలం నాటి సీసపు నాణెములు



పురాతన కంఠాభరణాలు



నవీన రాతియుగపు ఆయుధాలు

తొలి స్నాతకోత్సవానికి.. ఎయిమ్స్ ముస్తాబు

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదించారు. 2015 అక్టోబరులో కేంద్ర మంత్రివర్గం ఈ నిధులను మంజూరుచేయగా 2017 సెప్టెంబరులో నిర్మాణ పనులు మొదలయ్యాయి. నిర్మాణపరంగా అన్ని హంగులను పూర్తిచేసుకున్న మంగళగిరి ఎయిమ్స్‌ను 2024 సెప్టెంబరు 29న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు.

పచ్చని కొండల నడుమ..

మంగళగిరి ఎయిమ్స్‌కు పలు ప్రత్యేకతలు కూడా ఉన్నాయని చెప్పుకోవాలి. ఇది రాష్ట్రానికి నడిబొడ్డున ఉండడం ఒక విశేషమైతే రాజధాని అమరావతిలో కూడా ఒక భాగంగా కుదురుకుంది. అంతేకాదు...దాదాపు రెండొందల ఎకరాల సువిశాల విస్తీర్ణంలో పచ్చని కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటైంది. ఒక విధంగా చెప్పాలంటే దేశంలో ఇప్పటివరకు ఏర్పాటైన ఎయిమ్స్ ఆస్పత్రులన్నింటిలోను దిబెస్ట్ ఎయిమ్స్ అన్న ఖ్యాతి మంగళగిరి ఎయిమ్స్‌కే దక్కింది.

మంగళగిరి ఎయిమ్స్‌కు తొలి డైరెక్టరుగా డాక్టర్ ముఖేష్ త్రిపాఠి పనిచేయగా ప్రస్తుతం డాక్టర్ మదబానందకర్ రెండవ డైరెక్టరుగా ఈ ఏడాది జనవరి 24 నుంచి సేవలను అందిస్తున్నారు. ఈయన సర్జికల్ ఆంకాలజిస్టుగా విశేష అనుభవాన్ని గడించారు. డాక్టర్ టీఎస్ రవికుమార్ వైస్ ఛాన్సలర్‌గా కొనసాగుతున్నారు. ఇక పాలకమండలి సభ్యులుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తాజాగా ఎన్నికయ్యారు.

రూ. పదికే ఓపీ సేవలు

మంగళగిరి ఎయిమ్స్‌లో రూ. పదికే వైద్యసేవలను అందిస్తున్నారు. అంతేకాదు... ఇతరత్రా శస్త్ర చికిత్సలకు, పలురకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఫీజులు బయటి లేబొరేటరీలతో పోల్చితే చాలా తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉన్నాయి. కంప్లీట్ బ్లడ్ పిక్చర్‌కు రూ. 365, ఫాస్టింగ్ అండ్ ర్యాండమ్ బ్లడ్ షుగర్‌కు కలిపి రూ. 48, లివర్ ఫంక్షనింగ్ టెస్ట్‌కు రూ. 225, కిడ్నీ ఫంక్షనింగ్ టెస్ట్‌కు రూ. 225, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్ టెస్ట్, ఈసీజీకి, ఛాతీ ఎక్స్‌రేకు రూ. 60, మామోగ్రఫీకి రూ. 630, అల్ట్రా సోనోగ్రఫీకి రూ. 323, యూరిన్ ఎనాలిసిస్‌కు రూ. 35, హెచ్ఐటీ రాపిడ్ టెస్ట్‌కు రూ. 150, హెచ్‌బీయస్ ఏజీ రాపిడ్ టెస్ట్‌కు రూ. 28 వంతున ఛార్జీలు ఉన్నాయి.

అందుబాటులో ఉన్న విభాగాలు..

మంగళగిరి ఎయిమ్స్‌లో దాదాపు 27 స్పెషాలిటీ సేవా విభాగాలు, మరో 12 సూపర్ స్పెషాలిటీ సేవా విభాగాలు అందుబాటులో ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ సేవా విభాగాలలో కాలిన గాయాలు, ప్లాస్టిక్ సర్జరీ, గుండె మరియు హృదయనాళ వ్యవస్థ విభాగం, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం, క్యాన్సర్ విభాగం, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, పిల్లల శస్త్ర చికిత్స, ఊపిరితిత్తుల వైద్యవిభాగం, రుమటాలజీ, కాన్సర్ శస్త్రచికిత్స, యూరాలజీ విభాగాలు ఉన్నాయి. ఇవిగాక మరికొన్ని ప్రత్యే ఓపీడీ క్లినిక్‌లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిలో సమగ్ర రొమ్ము సంరక్షణ, నొప్పి నివారణ, పాంక్రియాస్ క్లినిక్, జన్యు మరియు అరుదైన వ్యాధి క్లినిక్, అంటువ్యాధుల క్లినిక్, సౌందర్య శస్త్రచికిత్స అండ్ రీజెనరేటివ్ మెడిసన్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ క్లినిక్, జన్యుసంబంధిత కౌన్సిలింగ్, ఫుట్ అండ్ చీలమండల క్లినిక్, ఆర్థ్రోస్కోపీ క్లినిక్, కౌమార గైనకాలజీ క్లినిక్, వంధ్యత్వ క్లినిక్, గైనీ అంకాలజీ క్లినిక్, హీమోథెరపీ క్లినిక్ వంటి ప్రత్యేక క్లినికల్ ఓపీడీ సేవలను ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చారు.

క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను ఆస్వాదించాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్


రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలో మూడోస్థానం సాధించిన గుంటూరు బాలికల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తితోనే గెలుపు, ఓటములను ఆస్వాదించాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఫిరంగిపురం దీనాపూర్ ఆవరణలో ఆర్‌సీజేసీ కళాశాల, పల్నాడు జిల్లా రగ్బీ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో రెండో రోజు బహుమతి ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో చీకటి, వెలుగు, కష్టాలు, సుఖాలవలె ఆటల్లో గెలుపు ఓటములు ఉంటాయని ఆయన తెలిపారు. క్రీడా స్ఫూర్తితో ఉండి ఓడిన జట్లు మరింత కష్టపడి ముమ్ముందు గెలిచేలా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్ర మంలో రాష్ట్ర స్థాయిలో బాలకల విభాగంలో సత్యసాయి జిల్లా జట్టుకు మొదటి బహుమతి, తూర్పు గోదావరి జిల్లా రెండో బహుమతి, గుంటూరు జిల్లా మూడో బహు మతి, అలాగే బాలుర విభాగంలో కర్నూలు జట్టుకు ప్రథ మ బహుమతి, ప్రకాశం జిల్లా ద్వితీయ బహుమతి, నెల్లూరు జట్టుకు తృతీయ బహుమతులను ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో కార్ప్ సంస్థ వ్యవస్థాపకురాలు ఎం స్వర్ణలతాదేవి, ఆర్‌సీజేసీ కళాశాల కరస్పాండెంట్ కే మేరీ, పల్నాడు జిల్లా రగ్బీ అసోసియే షన్ జిల్లా ప్రెసిడెంట్ ఈ కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ రామాంజనేయులు, ఆర్‌సీజేసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్, సెయింట్ జేవీఆర్ పార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వీ జీవన్ మణిబాబు, బాలబాట డిప్యూటీ డైరెక్టర్ టీ అమరనాథ్, టీ డానియేలు, ఎంవీ సుబ్బారావు, ట్రెజరర్ ఎం ప్రకాష్, ఆనంద్ విజయబాబు, చుక్కా కొండయ్య, టీ హృదయరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్రికోటేశ్వరస్వామి ఆరుద్రోత్సవం

● స్వామికి ఇరుముడులు సమర్పించిన మేథా దక్షణామూర్తి స్వాములు

కోటప్పకొండ(నరసరావుపేట), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆరుద్రోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. కోటయ్య స్వామికి మహన్యాస పూరక రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి 12 గంటల సమయంలో పాత కోటేశ్వర స్వామి ఆలయం వద్ద కర్పూర జ్యోతి దర్శనం చేసుకొని భక్తులు పులకించి పోయారు. వివిధ జిల్లాల నుంచి నుంచి మేథా దక్షణామూర్తి మాలధారణ స్వాములు ఇరు ముడులతో కోటయ్య సన్నిధికి చేరుకున్నారు. కర్పూర జ్యోతి దర్శనం అనంతరం స్వామికి ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, ఎండు ఫలాలు, సుగంధ ద్రవ్యాలు, విభూది, కుంకుమ, గంధం, తైలంలతో అభిషేకాలు నేత్ర పర్వంగా జరిగాయి. ఆలయంలో స్వామికి ఆరుద్రోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున స్వామికి అన్నాభిషేకం జరగనుంది. అనంతరం త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకరణ చేస్తారు. ఉదయం 8 గంటలకు యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర హోమాలు జరగనున్నాయి. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. కొండపై ఉన్న పాత కోటేశ్వర స్వామిని అరవిందబాబు దర్శించుకున్నారు. స్వామికి ఆయన ప్రత్యేక అభిషేకాలు చేశారు.


శ్రీ త్రికోటేశ్వర స్వామి మూలవిరాట్


పాత కోటేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


ఇరుముడులతో కొండకు చేరుకున్న గోనెపూడికి చెందిన మేథా దక్షణామూర్తి మాలధారణ స్వాములు

పరీక్షా కాలమ్



చేతి రాత, అక్షరదోషాలపై దృష్టిపెట్టండి

● ప్రణాళికతో పది తెలుగులో అత్యధిక మార్కులు

గుంటూరు విద్య, 16 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు టైమ్ టేబుల్ ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో పరీక్షకు సిద్ధం అయ్యే విద్యార్థుల కోసం ఇటు ప్రభుత్వ పాఠశాలల్లో అటు ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి. పాఠశాలల్లో పరీక్షల వాతావరణం మొదలైంది. ఈ నేపథ్యంలో పది విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ఎక్కువ మార్కులు ఎలా తెచ్చుకోవాలి? సబ్జెక్టులు ఎలా ప్రిపేర్ కావాలి? అనే విషయాలను ఆంధ్రజ్యోతి నిపుణులైన ఉపాధ్యాయు ల సహకారంతో వివరిస్తోంది. ఇందులో భాగంగా తొలుత జరిగే తెలుగు పరీక్షకు ఎలా సిద్ధం కావాలో గుంటూరు నగరపాలక సంస్థ ఎస్‌కేబీపీ ఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు జరుగుమాల జేమ్స్ వివరిస్తున్నారు.

పదవ తరగతిలో తెలుగు సబ్జెక్టు విషయానికి వస్తే ప్రధానంగా అవగాహన ప్రతిస్పందన, వ్యక్తీకరణ, సృజనాత్మకత, భాషాంశాలు ఉంటాయి. మొదటి పాఠ్యపుస్తకం 12 పాఠాలు ఉంటాయి. ఉపవాచకంలో రామాయణ కథ నుంచి ప్రశ్నలు వస్తాయి. ఆయా పాఠ్యాంశాల నుంచి వచ్చే ప్రశ్నల్ని ప్రణాళికాబద్ధంగా చదువుకుని పరీక్షకు సిద్ధం అయితే గణితంతో సమా నంగా అత్యధిక మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంది.

ప్రధానంగా కవి పరిచయాలు, నేపథ్యం, ప్రక్రియ, ఉద్దేశం వంటివి ఎక్కువ చదువుకోవాలి. ఆయా అంశాల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంది. ఇందులో మార్కులు తగ్గించడానికి అవకాశం ఉండదు. సమాధానాలు ఎంత బాగారాసినా అక్షరదోషాలు లేకుండా చూసుకోవాలి.

● ఆయా ప్రశ్నలకి జవాబులు పాయింట్ల వారీగా రాస్తే మార్కులు ఎక్కువ వస్తాయి. తరువాత తెలుగు వ్యాకరణం ఎక్కువగా చదువుకొని సాధన చేయాలి. ఇందులో అలంకారాలు, ఛందస్సు, అర్థాలు, వ్యతిరేక పదాలు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్తి అర్థాలు, వాక్యాల వంటి భిన్నరకాల అంశాలపై ప్రశ్నలు వస్తాయి. ఆయా ప్రశ్నల విషయంలో కూడా అక్షర దోషాలు లేకుండా కచ్చితంగా రాయగలిగితే అత్యధిక మార్కులు వస్తాయి.

● ఇంకా ప్రకృతి వికృతి, సొంత వాక్యాలు వంటి ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇవన్నీ ప్రణాళిక బద్ధంగా చదువుకుని పరీక్షకు సిద్ధం కావాలి. ఆయా అంశాలకు సంబంధించి 32 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.

● ఉపవాచకంలో రామాయణం కథ ఉంటుంది. ఇందులో రామాయణంలో పాత్రల గురించి ప్రధానంగా ప్రశ్నలు వస్తాయి. ఉదాహరణకు సీతమ్మ, రాముడు, దశరథ మహారాజు, మందర, కైక, గుహుడు, విభీషణుడు, జటాయువు తదితరుల పాత్రల గురించి రాయాలి. ఇవన్నీ నాలుగు మార్కుల ప్రశ్నలు. ఇక ఎనిమిది మార్కుల ప్రశ్నల విషయానికి వస్తే సీతారామ కల్యాణం, రావణాసురుడు సీతమ్మను అపహరించిన విధానం, రామ లక్ష్మణ భరత, శత్రుఘ్నులు జన్మించిన విధానం, రామ రావణ యుద్ధం ఏవిధంగా జరిగింది? ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇవి తప్పులు లేకుండా రాస్తే మంచి మార్కులు వస్తాయి.

● అదేవిధంగా పద్యాలు, చిన్న పద్యాలు, అపఠిత పద్యాలు, అపఠితిత గద్యం ఉంటాయి. పద్యం, గద్యం ఇచ్చి దాని కింద నాలుగు ప్రశ్నలు ఇచ్చి చిన్నచిన్న వాక్యాలుగా సమాధానాలు రాయాల్సి ఉంది. ఈ పద్యాలు పాఠ్యపుస్తకాలు లేదా బయటనుంచి ప్రశ్నాపత్రంలో ఇచ్చే అవకాశం ఉంది.

● పరీక్ష హాల్లో విద్యార్థి ప్రవేశించగానే ఎటువంటి ఆందోళన చెందకూడదు. ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలి. తాను చదివిన పాఠ్యాంశాల నుంచే ప్రశ్నలు వస్తాయనే ఆత్మవిశ్వాసంతో ఉండాలి.

● ముందుగా ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండుసార్లు చదవాలి. తరువాత బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి అక్షర దోషాలు లేకుండా విరామ చిహ్నాలు పాటిస్తూ పరీక్ష రాయాలి.

● ప్రశ్నలకు జవాబులు రాసే సమయంలో జవాబుకు జవాబుకు మధ్యలో గీత గీసుకోవడం చాలా అవసరం. సెక్షన్ నెంబర్ ప్రశ్న నెంబరు తప్పు లేకుండా వేయాలి. రాసిన పేపర్ మొత్తం చివరలో ఒకసారి పరిశీ లించుకోవాలి. సమయాన్నిబట్టి తప్పులు ఏమైనా ఉంటే సరిదిద్దుకోవాలి.



- జరుగుమాల జేమ్స్, తెలుగు ఉపాధ్యాయుడు, ఎస్‌కేబీపీఎంసీ ఉన్నత పాఠశాల, వేణుగోపాల నగర్ గుంటూరు


అర్ధరాత్రి మార్కెట్ సెంటర్‌లో ఆకు కూరల వ్యాపారుల సందడి

నిశీథిలో.. నగరం ఇలా..




డివైడర్‌పై చలిలోనే నిద్రిస్తూ..


చిరు వ్యాపార బళ్లకు రక్షణగా..



నగరమంతా నిద్ర మత్తులో జోగుతున్న వేళ.. ఆకాశం నుంచి రాలే మంచు బిందువులు పొగలా మారి.. కారుచీకట్లు తొలగించే కాంతులను కమ్మిన సమయాన. పడుకోవడానికి ఇళ్లు.. కప్పుకోవడానికి రగ్గు లేక ఫుట్‌పాత్‌పై ప్లాస్టిక్ సంచి ఆదరువుతో ఒకరు గురకలు పెడుతుంటే. తెల్లారకముందే బతుకుదెరువు కోసం.. చెత్త ఏరుకుంటూ.. ఒడిలో చంటి బిడ్డతో ఒకరు.. వారిని రిక్షాలో కూర్చోబెట్టి ఆ బరువును నెట్టుకుంటూ మరొకరు.. ఆకుకూరల అమ్మకాల కోసం అప్పుడే బారులుతీరిన జనం.. ఇదీ సోమవారం తెల్లవారుజామున గుంటూరు నగర ముఖ చిత్రం.

గుంటూరు (ఆంధ్రజ్యోతి).


విద్యుత్ వెలుగులు.. మంచు దుప్పటిలో కనువిందు చేస్తున్న గుంటూరు నగర రహదారులు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 124 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 59 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 52 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 143 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 1126 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

118 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన వేలంలో నామమాత్రంగా 118 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కాయ, కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,550, గరిష్ఠధర రూ.11,550, మోడల్‌ధర రూ.11,550 పలికాయి.

ధనుర్మాసం ప్రారంభం

వట్టిచెరుకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగనాయక భక్తురాలైన గోదాదేవి పాసుపతాలు చదవటంతో ధనుర్మాసం ప్రారంభమైనట్లు అని గంగా భ్రమరాంభిక సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయ అర్చకులు కృష్ణ స్వామి వెల్లడించారు. ధనుర్మాసం నెల రోజులు ఎంతో పవిత్రమైన నెలగా, విష్ణు ఆలయాల్లో హరి నామ స్మరణలతో భక్తులు సోమవారం తెల్లవారు జామున ఆలయాలకు చేరుకొని హరి కీర్తనలు ఆలపించటంతో ధనుర్మాసం ప్రారంభమైందన్నారు. అలాగే ధనుర్మాసం ప్రారంభంతో సంక్రాంతి మాసం ప్రారంభమైందనేది గుర్తించాలన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం

పెదనందిపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకోవడంలో రోటరీ సేవలు ఎంతో అభినందనీయమని తహసీల్దార్ శంకరబాబు అన్నారు. స్థానిక అశోకా పాఠశాలలో బీజేఆర్ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ హైదరాబాదు వారి సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం 16 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ వారు పోలియో నిర్మూలనకు విశేష కృషిచేస్తుందని, విద్యను ప్రోత్సహించేందుకు విద్యార్థులకు సైకిళ్ళు, ఉపకార వేతనాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనలు వంటివి చేపడుతున్నారన్నారు. రోటరీ క్లబ్ పెదనందిపాడు వారు 17 సంవత్సరాలుగా దాతల సహకారంతో కంటి, పలు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేద విద్యార్థులను ఆదుకునేందుకు చేయూతనందించడంతో పాటు మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నల్లపనేని శివప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ పోపూరి లక్ష్మీనారాయణ, సభ్యులు ముళ్ళపూడి చిననాగేశ్వరరావు, సిద్దా సాహెబ్, జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీపీఎం హైస్కూల్‌కు లయన్స్ క్లబ్ వితరణ

మంగళగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు పట్టాభిపురం ఆధ్వర్యంలో పెదవడ్లపూడి గ్రామంలోని ఏటీపీఎం హైస్కూల్‌కు సుమారు రూ.3 లక్షల విలువ చేసే ఫ్యాన్లు, బియ్యం, నిత్యావసరాలు సోమవారం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై 40 ఫ్యాన్లు, పది క్వింటాళ్ల బియ్యంతో పాటు నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్లు నూతలపాటి వీరప్రకాశరావు, మేళం కృపానందం, సీహెచ్ బాలస్వామి, రాయల్ గ్యాస్ కంపెనీ అధినేత నన్నపనేని నాగేశ్వర రావు, లయన్స్ కేబినెట్ సెక్రెటరీ పీ.వెంకట సుబ్బయ్య, జోనల్ చైర్మన్ గౌరీశంకర్, కోఆర్డినే టర్లు ఎస్.వెంకటేశ్వర్లు, కే.బెంజిమెన్, క్లబ్ ప్రెసిడెంట్ రాకేష్ రోషన్, జనవిజ్ఞాన వేదిక గుంటూరు అధ్యక్షుడు లక్ష్మరెడ్డి, ఎంలక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తాడికొండలో బాలుర గురుకుల పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న పరదేశి బాబు ఈ మధ్యనే అనారోగ్యంతో చనిపోయారని, కానీ ఫ్యామిలీ సర్టిఫికెట్ వారసులైన మాకు గాకుండా వేరే వ్యక్తికి ఇచ్చారని స్థానిక రామన్నపేటకు చెందిన మృతుడి మనమరాలు జీ సుజాత సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. సదరు వ్యక్తి ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో స్వీపర్‌గా ఉద్యోగంలో చేరాడని, అంతేగాక డెత్ బెనిఫిట్స్ పొందాడని అన్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపించి, న్యాయం చేయాలని కోరారు.

● **పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి**

కాకుమాను మండలం, పుసులూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు నిధులు కేటాయించాలని మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం అర్జీ అందజేశారు. ఫేజ్ 1లో వచ్చిన నిధులతో పాఠశాలను కొంత మేర అభివృద్ధి చేశామని, ఫేజ్ 2లో కూడా నిధులను కేటాయిస్తే పూర్తి స్థాయిలో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అంతేగాక ఒరగాని, పొన్నూరు మధ్య ఉన్న రహదారిలో గుంతలు ఏర్పడి, దుస్థితికి చేరుకుందన్నారు. ఈ రహదారికి నిధులను కేటాయించాలని కోరారు.

● **పరిహారం అందించాలి**

2009లో రైల్వే లైన్ల విస్తరణలో భాగంగా మా నివాసాలను కూల్చివేశారని, దానికి సంబంధించిన పరిహారం ఇప్పటివరకు అందలేదని మంగళగిరి నియోజక వర్గం, తాడేపల్లి, రైల్వే బ్లాక్‌కు చెందిన స్థానికులు అర్జీ అందజేశారు. కూల్చివేత సమయంలో పరిహారం వెంటనే ఇస్తామని అధికారులు చెప్పారని అన్నారు. కానీ ఈ రోజు వరకు పరిహారం ఇవ్వలేదని, దీనిపై అనేక మార్లు అధికారులను కలిసిన ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఫాతిమా, హిడింబా, తిరుమతమ్మ, జ్యోతి, శోభా తదితరులు ఉన్నారు.

రోడ్డు వేశారు.. మార్జిన్, వేగనిరోధకాలు మరిచారు

దుగ్గిరాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా ఎదురుచూసిన దుగ్గిరాల గ్రామప్రజలకిచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదునెలల కాలంలో మెయిన్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. 1.4కి.మీల మేర తారురోడ్డు నిర్మాణం పూర్తి చేసి 20రోజులు కావస్తున్నప్పటికీ రోడ్డు అంచున వాహనదారులు కిందపడిపోకుండా వేయాల్సిన మార్జిన్ వేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చైతన్యగోదావరి గ్రామీణబ్యాంక్ నుంచి పాత బీసీ వసతి గృహం వరకూ మురుగుకాల్వలు లేకపోవడం, రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురెదురు వాహనాలు వస్తే రోడ్డు మార్జిన్ దిగలేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సైకిల్‌పై వెళ్లే విద్యార్థులు, వృద్ధులు ఎదురొచ్చిన వాహనాలను తప్పించుకోలేక పడిపోతున్నారు. పాఠశాలల సమీపంలో వేగ నిరోధకాలను ఏర్పాటు చేయకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలతో ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా తెనాలి - విజయవాడ ప్రధానరహదారి దుగ్గిరాల పాతలాకు నుంచి మోరంపూడి వరకూ వేసిన తారు రోడ్డు అంచున సైతం మార్జిన్ వేయకపోవడం, గతంలో ఉన్న వేగ నిరోధకాల స్థానంలో కొత్తవి వేయకుండా వదిలేయడంతోనూ వాహనదారులు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారని, ప్రమాదాలకు కారణమవుతున్నారని పలువురు ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలని, రోడ్డు అంచున మార్జిన్‌లను తక్షణమే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మార్జిన్ వేయకుండా వదిలేసిన దుగ్గిరాల మెయిన్‌రోడ్



వేగనిరోధకాలు వేయకుండా ఉన్నతెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్

ప్రజల ఆరోగ్య భద్రతకు చర్యలు : మంత్రి నారాయణ

● నీరుకొండలో సంచార వైద్యశిబిరం ప్రారంభం



సభలో ప్రసంగిస్తున్న పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

మంగళగిరి సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పీ నారాయణ తెలిపారు. మాదల గోవర్ధనరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నీరుకొండలో ఏర్పాటు చేసిన ఉచిత సంచార వైద్యశిబిరాన్ని సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం డాక్టర్ మాదల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలియజేశారు. రైతులు అడిగిన కౌలు బకాయిలను త్వరలోనే ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంజీఆర్ చారిటబుల్ ట్రస్టు చేస్తున్న కృషిని అభినందించారు. మాదల శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యం అందని మారుమూల ప్రాంతాల్లోని పేదలకు వైద్యసేవలు అందించే ఉద్దేశ్యంతో ఈ సంచార వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కాటూరి వైద్యశాల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, బీపీ, షుగర్, కిడ్నీ, గుండె, కాలేయం, మూత్ర, రక్త పరీక్షలకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు, నాట్కో, ఐల్యాబ్ ఏపీ రాన్ హెల్త్ కేర్ సహకారంతో పరీక్షలు నిర్వహించి, నివేదికల ఆధారంగా నిపుణులైన వైద్యులతో సూచనలు, సలహాలు అందించారన్నారు. నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం, ఎమ్మెస్సెస్ స్మృతివనం, కొండవీటి వాగు నిర్మాణం చేపట్టాలని మంత్రి నారాయణను కోరారు. ఈ కార్యక్రమంలో ధనేకుల రామారావు, మాదల రాజేంద్ర, కాటూరి సుబ్బారావు, బెల్లకొండ నరసింహారావు, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, కాటూరి మెడికల్ కళాశాల అధినేత సుబ్బారావు, ఏపీ రాన్ ఎండీ మాదల అనిత, ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీ గోపిమూర్తి



లోకేశ్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీ గోపిమూర్తి, లక్ష్మణరావు తదితరులు

తాడేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా విజయం సాధించిన గోపిమూర్తి పీడీఎఫ్ నేత కేఎస్ లక్ష్మణరావులు సోమవారం ఉండవల్లిలోని నివాస గృహంలో మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గోపిమూర్తిని లోకేశ్ అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యావ్యవస్థలో తెస్తున్న సంస్కరణల గురించి లోకేశ్ వివరించారు.

చివరి భూములకు సాగునీరు అందేలా కృషి చేయాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చివరి సాగు భూములకు సాగునీరు అందేలా నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో తాడికొండ నియోజకవర్గంలోని నీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్లుగా ఎన్నికైన వారికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం పథకాలు రూపొందిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతు సంఘాలను, పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు. గతంలో రైతులకు సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్లు తదితర పనిముట్లను అందించేవారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని పూర్తిగా రద్దు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంలో డ్రోన్లు వినియోగించాలని ప్రకటించిందన్నారు. గ్రామాల్లో రైతుల సంఘాలు ఏర్పడితే డ్రోన్లు ఇవ్వనున్నారన్నారు. డ్రోన్ల అపరేటర్‌కు శిక్షణ ఇస్తారన్నారు. అయితే మేడికొండురు, తాడికొండ మండలంలోని కొన్ని గ్రామాల్లో వర్షాలకు పొలాలు పాడైన రైతులకు ఇన్సూరెన్స్ వచ్చేలా పేర్లు కాకుండా స్వప్రయోజనం కోసం ఇన్సూరెన్స్‌ను వేరే రైతుల పేర్లు రాశారని అన్నారు. దీనిపై సీరియస్ యాక్షన్‌కు రికమండేషన్ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గం పేరు చెడకొట్టవద్దని పేర్కొన్నారు. రైతులందరికీ అందాల్సిన ఫలాలను అందించాలని అంతేకాని అధికారులను ప్రలోభాలకు గురిచేయవద్దని చెప్పారు. చంద్రబాబునాయుడు కల అయిన అమరావతి నిర్మాణానికి మనందరం కలిసి కట్టుగా మద్దతుగా నిలబడాలన్నారు. తాడికొండ నియోజకవర్గం రాష్ట్రంలోనే రిచెస్ట్ నియోజకవర్గంగా నిలుపుకోవటానికి కలిసి మెలసి పనిచేయాలన్నారు. అనంతరం సీనియర్ నాయకులు యడ్లపాటి వెంకట్రావు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తాడికొండ మండల అధ్యక్షులు తలశిల ప్రసన్నకుమార్, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, మైనార్టీ సెల్ నాయకులు అబ్దుల్ గని, మైనేని గిరిజా, మేడికొండూరు మండల అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్, ఫిరంగిపురం అధ్యక్షుడు మండవ చిన్న నరసింహారావు, జనసేన జిల్లా కార్యదర్శి, యర్రగుంట్లపాలెం సర్పంచ్ తడవర్తి కేశవ తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో నిర్మాణాలకు మౌలిక వసతులు కల్పిస్తాం

తుళ్లూరు, డిసెంబరు 16:(ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతిలో ప్రభుత్వ ప్రభుత్వయేతర సంస్థల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం సహకరించి మౌలిక వసతులు కల్పిస్తుందని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అన్నారు. తుళ్లూరు రెవెన్యూలో ఇండో అమెరికన్ బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రికి కేటాయించిన 15 ఎకరాల స్థలంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు వెళుతున్నాయి. నిర్మాణాలకు అడ్డురావటంతో వాటిని పక్కకు తొలగించే పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వంలో రాజధాని అమరావతిలో భూములు కావాలని 132 సంస్థలు అప్లికేషన్‌లు పెట్టుకున్నాయని తెలిపారు. ఇందులో బసవ తారకం క్యాన్సర్ హాస్పటల్ ఒకటని పేర్కొన్నారు. దీనికి స్థలం కేటాయించగా విద్యుత్ టవర్, తీగలు ఉండటంతో పక్కకు మార్చాల్సి వచ్చిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే నిర్మాణానికి శంకుస్థాపన చేసిందని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రావటంతో అన్ని సంస్థలు వెనక్కి వెళ్లాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, రైతులు మద్దినేని వెంకట నరేష్, రాంబాబు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల గొప్పదనం తెలిపేందుకే ధనుర్మాస వ్రతం

● త్రిదండి చినజీయర్ స్వామి



భక్తులకు మంగళ శాసనాలు అందజేస్తున్న చినజీయర్ స్వామి

మంగళగిరి సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆండాళ్ తల్లి నారీమణుల ప్రతినిధిగా ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి మహిళల గొప్పదనాన్ని తెలియజేశారని త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజయ జీయర్‌స్వామి తెలిపారు. మంగళగిరి బైపాస్ రోడ్డులోని బాపూజీ విద్యాలయం ప్రాంగణంలో నెల రోజులపాటు జరుగనున్న ధనుర్మాస వ్రత మహోత్సవాలు, శ్రీకృష్ణ దీక్షా మహోత్సవాలు సోమవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. చినజీయర్ స్వామి ధనుర్మాస వ్రత మహోత్సవాలను ప్రారంభించి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. శ్రీవిల్లి పుత్తూరులో ఆండాళ్ సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాలను ప్రారంభించుకున్నామని, ఆండాళ్ తల్లి అనుగ్రహంతో మంగళగిరిలో కూడా ధనుర్మాస ఉత్సవాలను జరుపుకోవడం సంతోషకరమన్నారు. భగవంతుడి విగ్రహ రూపం భక్తులను కరుణిస్తుందనే సత్యాన్ని గోదాదేవి నిరూపించారని తెలిపారు. మంగళగిరిలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవ క్షేత్రానికి శ్రీవిల్లిపుత్తూరుగా నామకరణం చేస్తున్నట్టు వెల్లడించారు. నెల రోజులపాటు ప్రజలు ధనుర్మాస వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించి భగవంతుడి కృపను పొందాలని సూచించారు. అనంతరం భక్తులకు మంగళశాసనాలు, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీవిల్లి పుత్తూరులో గోదాదేవి సన్నిధి నుంచి ప్రత్యేక వస్త్ర ప్రసాదాన్ని స్వీక రించి మంగళగిరి గోష్ఠికి సమర్పించారు. తొలుత అర్చకులు, నిర్వాహకులు చినజీయర్‌స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైటీఆర్ ట్రస్టు చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, లైలా గ్రూపుల చైర్మన్ గోకరాజు గంగరాజు, క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంథి కాంతారావు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి సదిమేల శ్రీకూర్మనాథస్వామి, సీతానగరం జీయర్ ఆశ్రమ ప్రతినిధులు, విశ్రాంత డీజీ వెంకటస్వామి, ఆకురాతి శంకరరావు, లక్ష్మీ, వికాస తరంగిణి ప్రతినిధులు పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న దీక్షలు సోమవారంతో 14వ రోజుకు చేరుకున్నాయి. కార్మికుల దీక్షలను సీఐటీయూ నాయకులు ఎం శివకుమారి, వేముల దుర్గారావు, బీ వెంకటేశ్వర్లు, ఎఫ్‌టీయూ (న్యూ) నాయకులు కోటేశ్వరరావు, సీపీఐ నాయకులు కంచర్ల కాశయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా వందలాది కుటుంబాలకు మేలు చేసే కార్యక్రమం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించడమేనని ప్రభుత్వానికి సూచించారు. మంత్రి లోకేశ్ చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరారు. సోమవారం నాటి దీక్షల్లో ఏ రమాదేవి, ఈ శారమ్మ, డి నాగమల్లేశ్వరి యు రమణ, దుర్గా కూర్చున్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, గురవయ్య, డీ నాగేశ్వరరావు, టి దుర్గా భవాని, ఎస్కే సుభాని, బీ అంకయ్య, ఆశీర్వాదం, సూర్య ప్రకాష్, ఎస్కే బాషా, బుజ్జి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు టిడ్కోలో మౌలిక వసతులు కల్పించాలి



కమిషనర్ అలీం బాషాకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిడమర్రు టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులు కల్పించాలని, రుణాలు రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ అలీం బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాజధాని డివిజన్ కార్యదర్శి భాగ్యరాజు మాట్లాడుతూ నిడమర్రు టిడ్కో సముదాయానికి ప్రహరీ లేకపోవడంతో గేదెలు, కుక్కలు వస్తున్నాయని, అర్ధరాత్రుళ్లు అపరిచిత వ్యక్తులు చొరబడుతున్నారని, దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. మంచినీటి సౌకర్యం, డ్రైయినేజీ వ్యవస్థ లేవని, మురుగు మొత్తం పక్కనే వున్న పొలాల్లో పేరుకుపోయి దుర్వాసన వస్తోందని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. రాజధాని డివిజన్ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ టిడ్కో గృహాల రుణాలను ప్రభుత్వం రద్దు చేయాలని, వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

సీపీఐ శత వసంతోత్సవాలను జయప్రదం చేయాలి

మంగళగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీన జరుగనున్న సీపీఐ శత వసంతాల వేడుకలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని నాలుగో వార్డులో కోదూరి శివాజీ అధ్యక్షతన సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు కంచర్ల కాశయ్య, జాలాది జాన్ బాబు, జవ్వాది సాంబశివరావు, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మానవసేవా సంస్థ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ కోర్సు

తాడేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 22 సంవత్సరాలుగా నిరంతరం ప్రజాసేవలో పనిచేస్తున్న మానవసేవా సంస్థ ఆధ్వర్యంలో జనవరి 3, 2025 నుంచి ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సులో శిక్షణ ఇస్తామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు బాపట్ల ప్రకాశం ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులకు ఫ్రీ ఆన్‌లైన్ ఎంఎస్ ఆఫీస్ ట్రైనింగ్‌లో శిక్షణ ఇస్తామని మంగళ, గురు, శుక్రవారాల్లో సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఉచిత శిక్షణ ఉంటుందని చెప్పారు. మంగళగిరి బైపాస్ రోడ్డులోని రత్నాల చెరువు వద్ద ఉన్న వీఆర్ కాంప్లెక్స్‌లో.. వివరాలకు 9393771663లో సంప్రదించాలని సురేష్‌కుమార్ కోరారు.

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

కాకుమాను, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఇంధన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సోమవారం మండల విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన తోకల పెర్సిస్, బొనిగల శాశ్వత విద్యార్థులకు బహుమతులను విద్యుత్‌శాఖ పొన్నూరు ఏడీఈ శ్యామ్‌కుమార్, ఎంఈవో కెన్నడీ అందజేశారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యుత్ పొదుపు, పొదుపు విధానాలు తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈ మౌలాలిఖాన్, ప్రధానోపాధ్యాయుడు సత్యం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు నీరు అందేలా కృషి చేయాలి

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): చివరి భూములుగా ఉన్న ప్రతి ఎకరాకు నీరు అందేలా నీటి సంఘాల నాయకులు కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. సోమవారం, స్థానిక అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ తప్పిదాలతో నీటి సంఘాల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. దీంతో సాగునీరు అందక రైతులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారని అన్నారు. నీటి సంఘాల ప్రాముఖ్యతను గుర్తించి చంద్రబాబునాయుడు ఈ ఎన్నికలను నిర్వహించారని అన్నారు. దీంతో పాటు పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. నల్లమడ వాగు ఆధునికీకరణ, అగ్రికల్చర్ హబ్ ప్రారంభిస్తామని, దీంతో రాబోయే రోజుల్లో నియోజకవర్గ రైతులకు పూర్తి మేలు చేకూరుతుందని అన్నారు. త్వరలోనే గుంటూరు ఛానల్‌కి నిధులు విడుదల చేసి ఇచ్చిన హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నీటి సంఘాల ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో కూటమి నాయకులు భీమినేని వందనాదేవి, కొర్రపాటి నాగేశ్వరరావు, కన్నా దేవరాజు, జంపని హనుమంతరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల అభివృద్ధికి సహకారం

కాకుమాను, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : నీటి సంఘాల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ సహకారం ఎల్లవేళలా ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్‌చౌదరి అన్నారు. మండలంలోని టీసీ మెంబర్‌లతో కలిసి నీటి సంఘాల అధ్యక్షులు సోమవారం ఎమ్మెల్యే రామాంజనేయులును గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్, కాకుమాను నీటిసంఘాల అధ్యక్షుడు కొల్లా ఆదిశేషయ్య, రేటూరు అధ్యక్షుడు చుండూరు రాంబాబు, నల్లమోదు పూర్ణచంద్రరావు, పెద్ది రవీంద్రబాబు తదితరులున్నారు.

యడ్లపాటి వెంకట్రావు సేవలు మరువలేనివి

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



యడ్లపాటి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, టీడీపీ శ్రేణులు

గుంటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి యడ్లపాటి వెంకట్రావు సేవలు మరువలేనివని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. గుంటూరులోని టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా తెలుగు దేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి యడ్లపాటి వెంకట్రావు జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజనేయులు యడ్లపాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూర్ల మాట్లాడుతూ యడ్లపాటి వెంకట్రావు సంగం డెయిరీ స్థాపించడంలో ప్రముఖ పాత్ర నిర్వహించి రైతులకు అండగా నిలిచారన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసి గుంటూరు జిల్లా అభివృద్ధిలో భాగస్వాములయ్యారని, మంత్రిగా రాష్ట్రానికీ, రాజ్యసభ సభ్యుడుగా దేశానికీ సేవలందించడంలో ఆయనది కీలకపాత్ర అని కొనియాడారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, భీమినేని వందనాదేవి, మద్దిరాల గంగాధర్, నక్కల అగస్టీన్, ఇత్తడి రత్నకుమారి, కల్లూరి శ్రీనివాసరావు, పప్పుల దేవదాస్, బొబ్బిలి రామారావు, ఘంటసాల సోమశేఖర్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, వకుళాదేవి పాల్గొన్నారు.

నీరుకొండలో ఎస్ఆర్ఎం ట్యూషన్ సెంటర్



విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న మనోజ్‌కుమార్ తదితరులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆధ్వర్యంలో నీరుకొండ గ్రామంలో సోమవారం ఉచిత ట్యూషన్ సెంటరును ప్రారంభించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా, గుంటూరు అపెక్స్ సొల్యూషన్స్ ఈడీ నరేంద్రకుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వైస్ చాన్సలర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ట్యూషన్ సెంటరు ఏర్పాటుకు చెన్నయ్‌కు చెందిన పుతియ తలై ముఠై ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ట్యూషన్ సెంటరు నిర్వహణ, విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని యూనివర్సిటీ తరఫున అందిస్తామని చెప్పారు. గుంటూరుకు చెందిన అపెక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద పిల్లలు విద్యాపరంగా అభివృద్ధి చెందడానికి ఈ తరహా ట్యూషన్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వర్సిటీ క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అనూప్ సింగ్ సూర్యవంశీ, పబ్లిక్ రిలేషన్స్ డిప్యూటీ మేనేజర్ వేణుగోపాల్, ట్యూషన్ సెంటర్ టీచర్ బేతాళ పుణ్యవాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సుస్థిర అభివృద్ధిపై శిక్షణ తరగతులు



తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో శిల్ప

తుళ్లూరు డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సుస్థిర అభివృద్ధిపై మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ఎంపీడీవో శిల్ప అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. మండలంలో 19 పంచాయతీలకు గాను మొదటి విడత సోమ, మంగళవారాల్లో తొమ్మిది గ్రామాలకు శిక్షణ తరగతులు జరుగుతున్నట్టు ఎంపీడీవో తెలిపారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన, ఆరోగ్య భద్రత, బాలల స్నేహ గ్రామాలు, సమృద్ధిగా నీటి లభ్యత, సుపరిపాలన, సామాజిక భద్రత, క్లీన్ అండ్ గ్రీన్ తదితర అంశాల మీద శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. రెండో విడత 18, 19 తేదీల్లో పది గ్రామాలకు జరుగుతాయని తెలిపారు. గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్వేయర్లు, ఆరోగ్యసిబ్బంది, మహిళా పోలీసులు ఈవోపీఆర్డీ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన

కాకుమాను, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన ఈవోపీఆర్డీ రవిబాబు మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను స్థానికీకరణ ఆవశ్యకత, పేదరికం లేని మెరుగైన జీవనోపాధాలు, ఆరోగ్యవంతమైన సమాజం, బాలహిత, సమృద్ధిగా నీరు కల్పించడం, పచ్చదనం, పరిశుభ్రత, తదితర అంశాలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణ సమస్యను పరిష్కరించాలి

దుగ్గిరాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలగ్రామం చిలువూరులో మాదిగ శ్మశానవాటిక ఆక్రమణకు గురైందని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతూ, తహసీల్దార్ ఐ.సునీతకు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం సోమవారం అందించారు, దశాబ్దాల క్రితం ఉన్న శ్మశానవాటిక మార్గాన్ని విస్తరించాలని, అందులో బాగంగా అక్రమణలుంటే తొలగించాలని కోరుతూ నిరసన ప్రదర్శన జరిపిన అనంతరం వినతిపత్రం అందించారు. ఎమ్మార్పీఎస్ ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు లీగల్‌సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ ఆధ్వర్యంలో వినతిపత్రం అందిస్తున్నట్లు తెలిపారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా నేతాజి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యదర్శిగా వై.నేతాజి ఎన్నికయ్యారు. సోమవారం బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా పాశం రామారావు, ఎస్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, కే.నళినీకాంత్, ఎం.రవి, బూరగ వెంకటేశ్వర్లుతో పాటు 14 మందిని కమిటీ సభ్యులుగా, మొత్తం 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

ఇంధనం పొదుపు

ఉత్పత్తితో సమానం

తెనాలి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇంధనం పొదుపు చేస్తే ఉత్పత్తి చేసిన వారవుతారని ట్రాన్స్ కో ఈఈ చిరంజీవి తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు పురస్కరించుకుని సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, భావి తరాలకు వెలుగులు అందించేలా నేటి తరం ఆదర్శంగా నిలవాలన్నారు. అవసరమైన మేరకే విద్యుత్ వాడుకుంటే ఖనిజ సంపద అంతరించిపోకుండా ఉంటుందన్నారు. ఈ నెల 20 వరకు వారోత్సవాలు నిర్వహించి ప్రతి చోటా ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించాలన్నారు. కార్యక్రమంలో జేడీఈ అశోక్‌కుమార్, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాలకు ఉపకరణాలు అందజేస్తున్న లక్ష్మీరెడ్డి, సునీత తదితరులు

అంగన్‌వాడీ కేంద్రాలకు

ఉపకరణాల పంపిణీ

తెనాలి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు ఎస్‌బిఐ సహకారంతో ఉపకరణాలు పంపిణీచేశారు. పినపాడు, భాస్కరరావుపేట అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం స్టేషనరీ, కుక్కర్, ప్లేట్లు, గ్లాసులు, వాటర్ ఫిల్టర్, వాటర్ బాటిల్స్ ఆట వస్తువులు, పుస్తకాలు, పలకలు, బ్యాగులు, చార్ట్‌లు, ఎల్ఈడీ టీవీలు, రాక్‌లు, చాపలు అందజేశారు. మిత్ర హోలిస్టిక్ సొసైటీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, సిడిపివో సునీత, సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ, కౌన్సిలర్ రామయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై వినతుల స్వీకరణకు

ఏకసభ్య కమిషన్

● కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడి

గుంటూరు విద్య డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై విచారణ చేసేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకసభ్య కమిషన్ కార్యాలయం, విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు, మొదటి అంతస్తు, మొగలరాజపురం, కోనేరు లక్ష్మయ్య వీధి, విజయవాడ-520010 చిరునామాలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై రాతపూర్వక వినతులను ఏకసభ్య కమిషన్ ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కార్యాలయ పనివేళల్లో జనవరి 9వ తేదీ వరకు స్వీకరిస్తారని తెలిపారు. అర్జీలను వ్యక్తిగతంగా, రసీదుతో కూడిన రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించవచ్చునని తెలిపారు. అర్జీలను షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఏకసభ్య కమిషన్ వారికి omcscsub-classification@gmail.com అనే మెయిల్ ద్వారా కూడా పంపవచ్చన్నారు.

ఉద్యోగం పేర రూ.4 లక్షలు తీసుకొని మోసం

● ఎస్పీ గ్రీవెన్స్‌లో బాధితుడి ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని తన నుంచి రూ.4 లక్షల తీసుకొని ఎం లీలా కృష్ణ అనే వ్యక్తి తనను మోసం చేశాడని తెనాలి పరిధిలోని అంగలకుదురు గ్రామానికి చెందిన ఓ. సాయి కృష్ణ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తాను టూర్ అండ్ డై మేకింగ్ కోర్సు చదివి పూణేలో ఉద్యోగం చేస్తున్న సమయంలో తన సీనియర్ అయిన తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన ఎం లీలాకృష్ణ తనకు వేరే ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడన్నారు. ఈ క్రమంలో 2019లో తన తల్లిదండ్రులు వడ్డీకి డబ్బులు తెచ్చి లీలా కృష్ణకు రూ.4 లక్షలు ఇచ్చారన్నారు. సంవత్సరాలు గడుస్తున్న ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు అడుగుతుంటే బండారుపల్లిలోని తన తల్లిదండ్రులను కలిస్తే డబ్బులు ఇస్తారని చెబుతున్నారని, తాము ఆయన తల్లిదండ్రులకు వద్దకు వెళ్తే తమకు సంబంధం లేదు అంటున్నారని బాధితుడు సాయి కృష్ణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. చివరకు గత మార్చిలో లీలా కృష్ణ తల్లిదండ్రులు రూ.50 వేలు ఇచ్చారన్నారు. మిగిలిన మొత్తం అడుగుతుంటే తమకు సంబంధం లేదు అంటున్నారన్నారు. పథకం ప్రకారం తనను ఉద్యోగం పేరుతో మోసం చేసి డబ్బు తీసుకొని, తీరా డబ్బు తిరిగి ఇవ్వమంటే ఒకరిపై ఒకటి చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని బాధితుడు సాయికృష్ణ ఫిర్యాదులో వాపోయాడు.

మున్సిపల్ అద్దె బకాయిలు రూ.కోట్లలో..

● మూడు కాంప్లెక్స్‌లలో 17 మంది రూ. 72 లక్షల బకాయి

● వైసీపీ పాలనలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

పొన్నూరు పురపాలక సంఘానికి అద్దె బకాయిలు గుదిబండగా మారాయి. దశాబ్దాల తరబడి మున్సిపల్ కాంప్లెక్స్‌లలో తిష్ట వేసిన లీజుదారులు ఏళ్ల తరబడి అద్దెలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. వైసీపీ పాలనలో లీజుదారుల నుంచి సబ్ లీజులు పొందిన ఆ పార్టీ శ్రేణులు మున్సిపాలిటీకి అద్దెలు చెల్లించకుండా ఎగనామం పెట్టారు. మున్సిపల్ అధికారులు సైతం అద్దె వసూళ్లలో ఆ పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వ్యవహరించారు. దీంతో రూ. కోట్లలో మున్సిపల్ ఆదాయానికి గండి పడింది.

పొన్నూరుటౌన్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘంలో ఇందిరా గాంధీ కాంప్లెక్స్, రాజీవ్ గాంధీ కాంప్లెక్స్, కొప్పాక వెంకయ్య కూరగాయల మర్కెట్, అనురాధ కాంప్లెక్స్‌ల పేరుతో ప్రభుత్వ కంప్లెక్స్‌లు ఉన్నాయి. ఈ కాంప్లెక్స్‌లలో 184 దుకాణాలను లీజుకు ఇవ్వడం ద్వారా ఏడాదికి పురపాలక సంఘంకు కోటి రూపాయల ఆదాయం సమకూరుతుంది. ఈ ఆదాయంతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను పురపాలక సంఘం సమకూరుస్తుంది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో పన్నుల వసూళ్ల ప్రక్రియ ప్రహసనంగా మారింది. వైసీపీ పాలకులు దుకాణాలు దక్కించుకున్న వారి నుంచి సబ్ లీజులు పొందటం పురపాలక సంఘంకు అద్దెలు చెల్లించకుండా కాలయాపన చేస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కరోనా లాక్ డౌన్ రావడంతో వ్యాపారాలు జరగలేదని, తర్వాత వ్యాపారాలు జరిగినప్పటికి రాజకీయ ప్రేరేపితంగా అద్దె చెల్లించకుండా పలుకుబడితో కొనసాగుతున్నారు. అద్దె వసూళ్లకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు వెళితే రాజకీయ నాయకులతో ఫోన్ చేయించుకొని తిప్పి పంపించిన సంఘటనలు ఉన్నాయి. మున్సిపల్ ఆదాయం నిలిచిపోయినప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో పని చేసిన అధికారులు అద్దె వసూళ్లకు ఆసక్తి చూపలేదు. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కోటి వరకు బకాయిలు పేరుకుపోయాయి. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో దుకాణ దారులు ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలు దుకాణాలకు లీజు గడువులు పూర్తయినప్పటికీ దుకాణాలు



పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లు

ఖాళీ చేయకుండా అద్దె చెల్లించకుండా ప్రజల ఆస్తి అయిన మున్సిపల్ షాపులను వదలకుండా అనుభవిస్తుండటంతో ప్రజలు విమర్శిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు బకాయిల వసూళ్లపై దృష్టి సారించలేకపోవడం పట్ల అనుమానాలు ఉన్నాయి.

పురపాలక సంఘం పరిధిలోని ఇందిరా కాంప్లెక్స్‌లో 11 మంది లీజుదారుల నుంచి రూ.28 లక్షలు, రాజీవ్‌గాంధీ కాంప్లెక్స్‌లో నలుగురినుంచి రూ.16 లక్షలు, అనురాధ కాంప్లెక్స్ రూ. 27 లక్షలు అద్దె బకాయిలు వసూలు కావలసివుంది. ప్రస్తుతం లీజు గడువు పూర్తి కావడంతో ఈ దుకాణదారులకు అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

పట్టణాభివృద్ధికి మున్సిపల్ నిధులే కీలకం..

పొన్నూరు పట్టణంలో అభివృద్ధి చెందాలన్నా ప్రజలకు అవసరమైన వసతులు సమకూరాలన్న మున్సిపల్ నిధులు అవసరం ఎంతో ఉంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ప్రజలు నుంచి వచ్చే ఇంటి పన్నులు, నీటి పన్నులు వంటి నిధులతో పురపాలక సంఘం మనుగడ సాగిస్తుంది. అద్దెలు సకాలంలో వసూలైతే ప్రజలకు అవసరమైన రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణం, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంది. ఇప్పటికైన పురపాలక సంఘం అధికారులు స్పందించి అద్దె బకాయిలు వసూళ్ళపై దృష్టిసారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఈ విషయంపై రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావును వివరణ కోరగా అద్దె బకాయిదారులకు నోటీసులు జారీ చేసి అద్దె వసూళ్ల చేస్తున్నామని, అద్దె చెల్లించకపోతే క్రిమినల్ కేసులు పెట్టనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనులను

సక్రమంగా నిర్వహించండి

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రతిరోజు పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక 35వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు డ్రెయిన్‌లోని సిల్ట్‌ను తొలగించాలని, తొలగించిన వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదని శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

బంగారు ఆభరణాల చోరీ

తెనాలి అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : బస్సు ఎక్కిన ప్రయాణీకుల బ్యాగులలోని బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటనపై సోమవారం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గంగానమ్మపేటకు చెందిన వెంకటసాంబశివరావు 14వతేది రాత్రి గుంటూరులో జరిగే వివాహానికి భార్యతో కలిసి వెళ్లాడు. తిరిగి ఆదివారం బస్సులో ఇంటికి వస్తుండగా బ్యాగులోని బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఇంటికి వచ్చి చూసుకుంటే నగలు పెట్టిన బ్యాగులో రూ.3.50 లక్షల విలువైన నగలు కనిపించకపోవడంతో సోమవారం టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమతో పాటు ఇద్దరు మహిళలు బస్సు ఎక్కారని సంగం జాగర్లమూడిలో దిగారని, వారిపై అనుమానం ఉన్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

● డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు జరపటం చట్టరీత్యా నేరమని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఈరుగుల అన్నపూర్ణ అన్నారు. స్థానిక కొత్తపేటలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం నేరం అన్న విషయంపై డివిజన్ స్థాయి సలహా సంఘ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ భారత ప్రభుత్వం 1994వ సంవత్సరంలో లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించిందన్నారు. తెనాలి డివిజన్ వ్యాప్తంగా ఉన్న స్కానింగ్ సెంటర్‌లు, ప్రైవేట్ వైద్యాశాలలో ఎట్టి పరిస్థితులలో లింగ నిర్ధారణ పరీక్షలు జరుపరాదన్నారు. ఎవరైనా పాల్పడితే చట్టప్రకారం చర్యలకు బాధ్యులౌతారని హెచ్చరించారు. ప్రతి నిత్యం సిటీ స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహిస్తుందని, ఎక్కడైనా లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలోరెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, డివిజన్ స్థాయి సలహా సంఘ సభ్యులు పాల్గొన్నారు.



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌కుమార్

ఫార్మసీ విద్యార్థులకు

సాఫ్ట్‌వేర్ టూల్స్‌పై శిక్షణ

తెనాలి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ టూల్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఐపీఏ, ఎస్ఎఫ్ఏ చాప్టర్‌తో కలిసి నేషనల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ, ఫార్మా-డీ, బీ.ఫార్మసీ విద్యార్థులు క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌పై నైపుణ్యం పొందాలన్నారు. సాఫ్ట్‌వేర్ సాధనాల ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించడం లక్ష్యమన్నారు. రిసోర్స్‌పర్సన్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ, క్లినికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్‌లు, ఫార్మాస్యూటికల్ కంపెనీలలో ఉద్యోగాలకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. కో-ఆర్డినేటర్ సాయిరాజేష్, అంజాద్ ఆలీ, జ్యోతిబసు, నందగోపాల్ కృష్ణ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మేటివ్ పరీక్ష నిర్వహణకు

పకడ్బందీ ఏర్పాట్లు

తెనాలి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సమ్మేటివ్ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు గత బుధవారం మొదలయ్యాయి. సోమవారం జరగాల్సిన గణితం పరీక్ష పేపర్ యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో పరీక్ష రద్దు చేశారు. రద్దు అయిన పరీక్షను మళ్లీ ఈ నెల 20న నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష పత్రం లీకు కాకుండా సైన్స్, గణితం ప్రశ్నా పత్రాల బండిల్స్ పోలీస్‌స్టేషన్‌లో భద్రపరచాలని విద్యాశాఖాధికారులు ఆదేశించారు. దీంతో పలు మండలాల్లో ప్రశ్నాపత్రాల బండిల్స్‌ను పోలీస్‌స్టేషన్‌కు చేర్చారు. సాధారణంగా పదో తరగతి ఫైనల్ పరీక్షల్లోనే ఈ విధానం అమలు చేస్తారు. ప్రశ్నా పత్రం లీకు కాకుండా ఏర్పాట్లు చేసినప్పటికీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలనే కొందరు వాటిని యూట్యూబ్‌లో పెట్టడంతో విద్యార్థులకు ప్రశ్నా పత్రం తెలిసియింది. దీంతో పరీక్షల లక్ష్యం దెబ్బతింటుందని ఆలోచించి విద్యాశాఖ పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు చర్యలు చేపట్టింది.



విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నేతలు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

తెనాలిఅర్బన్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించాలని, విద్యుత్ రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు ఉపసంహరించుకోవాలని సీపీఎం కార్యదర్శి కే.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలో విద్యుత్ విధానాలను నిరసిస్తూ సోమవారం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ట్రూఅప్ చార్జీలను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. నాడు స్మార్ట్ మీటర్ల విధానంపై విమర్శలు గుప్పించినవారు, నేడు అమలుచేయటం రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలి, రాజ్యలక్ష్మి, ఆషాబీ పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం

ఆధార్ సెంటర్ ప్రారంభం

కొల్లిపర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సౌకర్యార్థం మండల పరిధిలోని వల్లభాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 20వతేది వరకు హైస్కూల్‌లో ఆధార్ సెంటర్‌ను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అదే విధంగా వల్లభాపురం సచివాలయంలో ఈనెల 26 నుంచి 28 వరకు ఆధార్ సెంటర్‌ను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఆధార్‌లో ఏ విధమైన తప్పులు ఉన్నా, ఇతర మార్పులు, చేర్పులను సరి చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించు కోవాలన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 162 అర్జీలు

● పరిష్కరించాలంటూ ఆదేశాలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 162 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారితో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అసమగ్ర సమాచారంతో పిటిషన్ పరిష్కరిస్తే సదరు అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేసీ భార్గవతేజ్ మాట్లాడుతూ కోర్టు కేసులను సమీక్షిస్తూ, ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం హెచ్‌వో విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డీపీవో నాగసాయి కుమార్, డీసీవో పాల్గొన్నారు.

సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలి

నగరంలో అంజుమన్ ఈఇస్లామియాసొసైటీ కమిటీ ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని ప్రజాసేవ సమితి పార్టీ ఆధ్వర్యంలో షేక్ రహీం అర్జీ అందజేశారు. ఎన్నికలు నిర్వహించకుండా అధికారులు వక్ఫ్‌చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు.

జాతీయ ఇంధన వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు విద్య, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా రూపొందించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి సోమవారం ఆవిష్కరించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్ ఆదాను ప్రతి ఒక్కరూ పాటించి భావితరాలకు ఇంధన వనరులను అందించాల్సి ఉందన్నారు. ఈనెల 20 తేదీ వరకు జరిగే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలపై ప్రజలకు విరివిగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఎస్ఈ ఆపరేషన్ ఏవీఎల్ఎన్ మూర్తి, సీఆర్డీఏ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, ఈఈ శ్రీనివాసబాబు, నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ వి.కృష్ణారెడ్డి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ముస్తాక్ అహ్మద్, హుస్సేన్ ఖాన్, గురవయ్య పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న రామానుజ స్వామి

ధనుర్మాస వ్రత మహోత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బస్టాండ్ - వీఎస్ఆర్ కళాశాల రోడ్డులో సోమవారం ధనుర్మాస వ్రత మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు జరగనున్న ఉత్సవాలను నరేంద్ర రామానుజ దాసస్వామి ప్రారంభించారు. తిరుప్పావై పాశురం విశిష్టతను భక్తులకు వివరించారు. శరణగతి ఘోష్టి ఆధ్వర్యంలో చేపట్టిన మహోత్సవాలు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మారీసుపేటలోని కోదండ రామస్వామి ఆలయంలో ధనుర్మాస ప్రాతఃకాలం శ్రీకృష్ణుడికి గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు చేశారు. తిరుప్పావై పాశుర పారాయణ, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. నారాయణ స్వామి, శివానందకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు

జీవన ప్రమాణాలు మెరగయ్యేలా ప్రణాళికలు

● రాష్ట్రస్థాయి శిక్షణ పరిశీలకులు మల్లికార్జునరావు

● మండల స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ

పొన్నూరుటౌన్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా ప్రణాళికలు రూపొందించి సుస్థిరత సాధించేలా గ్రామాలు ముందుకు సాగాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, రాష్ట్రస్థాయి శిక్షణ పరిశీలకులు కేవీఎస్ మల్లికార్జునరావు అన్నారు. సోమవరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర గ్రామ స్వరాజ్ యాన్ నిధులతో, రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ' అనే అంశంపై మండల స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణా తరగతులు నిర్వహించారు.. తరగతులకు హాజరైన పరిశీలకులు మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రస్తుతం ప్రజల అవసరాలు తీర్చడంతో పాటు, భవిష్యత్ తరాలు వారికి అవసరమైన వనరులు మిగులుస్తూ, ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు ఉండాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు గ్రామాలు అభివృద్ధికి 2030 నాటికి ఐక్యరాజ్యసమితి, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిరాభివృద్ధిని సాధించేందుకు ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడతాయన్నారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కల్పించటం, ఆరోగ్యకరమైన ప్రాంతం, సమృద్ధిగా నీరు, పచ్చదనం పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు కల్పన, సామాజిక న్యాయం, సుపరిపాలన వంటి అంశాలతో సుస్థిరాభివృద్ధి సాధించవచ్చని అన్నారు. సమావేశంలో ఎంపీపీ భవనం పద్మలీల పంచాయతీరాజ్ డీడీ వీ.నారాయణరావు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు సీడీపీవో వెంకటరమణ ఎంఈవో కే శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలోనూ శిక్షణా తరగతులను నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో కొప్పాక లలిత, అధికారులు పాల్గొన్నారు.



తెనాలిలో కమిషనర్ శేషన్నకు సమస్య విన్నవిస్తున్న జనసేన నేత గౌరీశంకర్ తదితరులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో ఇంజనీరింగ్ విభాగానికి రెండు అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీపతిరావు, మున్సిపల్ మేనేజర్ చండీ దేవసేన, ఏఈ డి బాలాజీ, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి అర్బన్, (ఆంధ్రజ్యోతి) : సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందాయి. రెవెన్యూ 1, హౌసింగ్ 2, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, ట్రాన్స్ కో, ఐసిడిఎస్, డిఆర్‌డిఏ, మార్కెటింగ్ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందించారు.

కొల్లిపర, (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు దరఖాస్తులు రాగా, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించినట్లు తహసీల్దార్ సిద్ధార్థ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవ్, ఎంఈవో సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభం



ప్రత్యేక పూజలందుకున్న శలపాడు వేణుగోపాల స్వామి

పొన్నూరుటౌన్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు - చేబ్రోలు మండలాల్లో వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. ధనుర్మాసం ప్రారంభ సందర్భంగా ఆలయాలోని మూలవిరాట్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మండలం పరిధిలోని వైష్ణవాలయాలలో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. చింతలపూడి గ్రామంలో వేంచేసి ఉన్న సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వేణుగోపాల స్వామి మూల విరాట్, ఉత్సవ మూర్తికి అభిషేకాలు జరిపారు. అనంతరం అర్చనలు జరిగాయి. మహిళల ఆధ్వర్యంలో తిరుప్పావై పఠించారు. అలాగే పట్టణంలోని శ్రీ స్వర్ణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు నిర్వహించారు. శ్రీదేవి, పద్మావతి, గోధ సమేత స్వర్ణ వెంకటేశ్వర స్వామి మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. మరో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం సాక్షి భవనారాయణ స్వామి ఆలయం, చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో వేంచేసి వున్న సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలలో ధనుర్మాస పూజలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ మంత్రి యడ్లపాటి జయంతి

తెనాలి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి దివంగత యడ్లపాటి వెంకట్రావు జయంతి వేడుకలు సోమవారం గాంధీనగర్‌లో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు వంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ, శాసన సభ్యునిగా, జడ్పీ చైర్మన్‌గా, మంత్రిగా పలు పదవులు నిర్వహించి రాష్ట్రాభివృద్ధికి దోహదపడ్డారని చెప్పారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. బిఎస్‌కె ప్రసాద్, ఈదర పూర్ణచంద్, కోటేశ్వరరావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ పాలక మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న అనీల్ చౌదరి

ఆలయ చైర్మన్‌గా అనీల్‌చౌదరి

పొన్నూరుటౌన్, డిసెంబరు16: మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలోని వేంచేసి ఉన్న వేణుగోపాల స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా మారుపూడి అనీల్ చౌదరి నియమితులయ్యారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కుమార్‌బాబు సమక్షంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా అనీల్ చైదరి వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్ అనిల్ చౌదరి కాగా, సభ్యులుగా ధూళిపాళ్ళ బావయ్య చౌదరి, పెదర్ల వీరబ్రహ్మం, రావిపాటి సురేష్, నరసింహారావు, తమిర్సి సురేష్, పర్వత సూరిబాబు తదితరులు ప్రమాణస్వీకారం చేసారు. పాలకవర్గ సభ్యులను ధూళిపాళ్ళ ప్రమీలాదేవి, గ్రామస్థులు అభినందించారు.